RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

Published From : Rangareddy, Hyderabad paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 51 సోమవారం 02 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-



టీ20 ప్రపంచకప్ లో భారత్ తో
మ్యాచ్ ను బహిష్కరిస్తున్నాం

## ముగిసిన కేసీఆర్
# సిట్ విచారణ

- నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ
- పలు డాక్యుమెంట్లతో కేసీఆర్ ఇంట్లోకి వెళ్లిన సిట్ అధికారులు
- కేసీఆర్ నివాసం వద్ద భారీగా మోహరించిన పోలీసులు
- కేసీఆర్ విచారణను ఆడియో, వీడియో రూపంలో ఐదుగురు ఉన్నతాధికారుల సిట్ బృందం రికార్డింగ్
- హైదరాబాద్‌లోని నందినగర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం
- పోలీసులు నందినగర్‌లోని సున్నితమైన ప్రదేశాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 01 :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), కేసీఆర్‌ను దాదాపు 4 గంటల 50 నిమిషాల పాటు విచారించింది. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసుకున్నారు.ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు - మిగతా 2 లో




## కెమెరా జర్నలిస్ట్ దాడిని ఖండించిన కేంద్ర మంత్రులు

బీఆర్ఎస్ భవన్ దగ్గరకు కవరేజ్ కోసం వెళ్లిన కెమెరా జర్నలిస్ట్ పవన్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి

దాడిని తీవ్రంగా ఖండించిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్

## సిట్ ఒక
# "సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్"

- 'సిట్'కు కొత్త అర్థం చెప్పిన హరీశ్ రావు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటైన సిట్ ఒక "సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్" అన్న హరీశ్
- కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులు రాజకీయ కక్షసాధింపు చర్యలేనని ఆగ్రహం
- పాలనలోని వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ డ్రామా అంటూ విమర్శలు
- చట్టబద్ధం కాకపోయినా కేసీఆర్ దర్యాప్తునకు సహకరిస్తున్నారని వెల్లడి
- వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 01 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'సిట్' కాదని, 'సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్' అని ఆయన కొత్త అర్థం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి ఫోన్‌లో ఏది చెబితే, పోలీసులు ఇక్కడ అదే పాటిస్తున్నారని ఆరోపించారు. సిట్ స్వతంత్రంగా పనిచేయడం లేదని, సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే నడుచు కుంటోందని, - మిగతా 2 లో

## రూ.53.47లక్షల కోట్లతో
# కేంద్ర బడ్జెట్




- పద్దులో 43శాతం పథకాలకే కేటాయింపు
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్
- మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు
- కొన్ని రకాల ఔషధాలు, ఈవీ బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్ ధరల్లో తగ్గుదల
- వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు
- చిన్న, సన్నకారు రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు
- యువశక్తి బడ్జెట్‌గా అభివర్ణించిన నిర్మలా సీతారామన్
- ప్రజల ఆశలను చేరుకోవడమే లక్ష్యమని వ్యాఖ్య
- పెరగనున్న సిగరెట్, లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు
- విదేశీ విద్య, వైద్యపరికరాలపై తగ్గనున్న భారం
- విదేశీ యాత్రలు, విద్య, వైద్యంపై పన్ను, టీడీఎస్ తగ్గుదల
- ఏప్రిల్ 2026 నుంచి నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం
- రోడ్డు ప్రమాద బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించే లక్ష్యం

**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 01 :** స్వాతంత్ర భారత చరిత్రలో తొలిసారి ఆదివారం కేంద్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా సంస్కరణల పథాన్ని కొనసాగింపునకే మొగ్గుచూపారు. ఈ మేరకు 2026-27 వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించిన ఆమె మొత్తం రూ.53,47,315 కోట్లతో ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా వేసిన ఆర్థిక మంత్రి అందులో పన్నుల ద్వారా రూ.28,66,922 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.6,66,228 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మూలధన రాబడులను రూ.18,14,165 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు ద్వారా సమీకరించనున్నట్లు వివరించారు. కేటాయింపుల్లో రక్షణ, రవాణా రంగాలకు అగ్ర తాంబూలం ఇచ్చిన నిర్మలమ్మ, గ్రామీణ భారతానికి నిధులు విదిల్చారు. అలాగే, వ్యవహాయానికి టెక్నాలజీ సొబగులు అద్దేలా కేటాయింపులు చేశారు.వ్యయానికి సంబంధించి, రెవెన్యూ వ్యయం రూ.41,25,494 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో వడ్డీ చెల్లింపులకే రూ.14,03,972 కోట్లు వెళ్లనున్నట్లు వివరించారు. మూల ధన వ్యయం రూ.12,21,821 కోట్లుగా ప్రతిపాదించారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.4 శాతంగా అంచనా వేసిన ఆర్థికమంత్రి - మిగతా 2 లో

## వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్‌గా కేంద్ర బడ్జెట్

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టాం
- బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు
- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది
- 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్
- కేంద్ర బడ్జెట్ ద్రవ్యలోటును నియంత్రిస్తుంది
- లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి భారత్ ఎదిగింది
- భారత్‌ను డేటా సెంటర్‌గా మార్చేందుకు ట్యాక్స్ హాలిడే
- ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్ మరింత దోహదం



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 01 :** కేంద్ర బడ్జెట్ భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రా యపడ్డారు. 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపె ట్టామన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిం దని అన్నారు. సంస్కరణలను బలోపేతం చేయటంతోపాటు వికసిత్ భారత్ నిర్మాణానికి రోడ్‌మ్యాప్‌గా పనిచేస్తుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. త్వరలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించనుందని, చరిత్రాత్మక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు - మిగతా 2 లో

## ఇబ్రహీంపట్నంలో హైటెన్షన్.. జోగి రమేశ్ ఇంటికి నిప్పు

- మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడి
- విజయవాడ ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం
- నివాసానికి నిప్పు పెట్టి, ఫ్లెక్సీలను తగులబెట్టిన ఆందోళనకారులు
- చంద్రబాబు, లోకేశ్‌పై వ్యాఖ్యలకు నిరసనగా ఈ ఘటన
- భారీగా మోహరించిన పోలీసులు, పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 01 :** విజయవాడ సమీపంలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ నివాసాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముట్టడించాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయానక వాతావరణం ఏర్పడింది.టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై జోగి రమేశ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీడీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. తొలుత ఇంటిపై రాళ్లతో దాడి చేసి, ఆ తర్వాత ఇంటికి నిప్పుపెట్టారు. ఇంటి చుట్టూ ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను కూడా దగ్ధం చేశారు. దాడి సమయంలో జోగి రమేశ్ ఇంట్లో లేరు. ఈ ఘటనలో ఇంటి మొదట అంతస్తులో మంటలు ఎగిసిపడ్డాయి.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని - మిగతా 2 లో

## పనిచేసే వారికి పట్టం..
# మారకుంటే నమస్కారం

- కుప్పం నుంచి చంద్రబాబు స్ట్రాంగ్ మెసేజ్!
- కుప్పంలో కార్యకర్తలతో చంద్రబాబు సమావేశం
- నిజంగా కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసా
- పనితీరు బాగోకపోతే నిర్మొహమాటంగా పక్కన పెడతానని హెచ్చరిక
- కుప్పం మోడల్‌నే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- ఒకే సీజన్‌లో కుప్పానికి హంద్రీ-నీవా జలాలు తెచ్చామని వెల్లడి
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపించామని వ్యాఖ్య




**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 01 :** ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కుప్పంపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కుప్పంలో ఆదివారం నాడు నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను వెతుక్కుని వచ్చి గౌరవిస్తానని భరోసా ఇస్తూనే, పనితీరు మార్చుకోని నేతలకు గట్టి హెచ్చరికలు పంపారు. ఇదే సమావేశంలో, నాడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. - మిగతా 2 లో

## భారత్ ఆకాంక్షలకు
# అనుగుణంగా బడ్జెట్

- బ్యాలెన్స్ కుదిరింది... కేంద్ర బడ్జెట్‌పై మంత్రి నారా లోకేశ్ స్పందన
- కేంద్ర బడ్జెట్‌ను స్వాగతించిన మంత్రి నారా లోకేశ్
- భారత్ ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని ప్రశంస
- ఏపీకి క్రిటికల్ మినరల్ కారిడార్, హైస్పీడ్ రైలు వంటివి లబ్ధి చేకూరుస్తాయి
- పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగాలు సృష్టిస్తామని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 01 :** కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. ఇది దేశ వృద్ధికి, దీర్ఘకాలిక ఆశయాలకు అనుగుణంగా ఉన్న సమతుల్య బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు. ఈ బడ్జెట్‌ను రూపొందించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన ప్రయోజనాలు చేకూరనున్నాయని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యంగా,క్రిటికల్ మినరల్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఇరాన్‌పై ట్రంప్ దూకుడు

ఇరాన్ పాలకులను అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు. కనీవినీ ఎరుగనంతగా విరుచుకుపడతానని బెదిరిస్తున్నాడు. ట్రంప్ మాటమీద నమ్మకం లేకనో, తనమీద తనకు శ్రుతిమించిన నమ్మకంవల్లనో ఇరాన్ ఎప్పటిలాగానే మాటకుమాట బదులిస్తోంది. ఈ అదిలింపులూ బెదిరింపులకు జడిసేది లేదని, ట్రిగ్గర్ బిగించి సర్వసన్నద్ధంగా ఉన్నామని ట్రంప్‌ను తీసిపారేస్తోంది. ఇరాన్ సీనియర్ నాయకులు లక్ష్యంగా ఈ మారు దాడులు జరిగి, ఈ ముట్టడితో కచ్చితంగా ట్రంప్ ఆశిస్తున్న నాయకత్వం మార్పు సాధ్యపడుతుందని పాశ్చాత్య మీడియా సంస్థల నమ్మకం. ఒకదశలో కాస్తంత తగ్గుముఖం పట్టినట్టుగా కనిపించిన ఖమేనీ వ్యతిరేక ఉద్యమం, తిరిగి తారస్థాయికి చేరడంతో ఇంతకుమించిన మంచిసమయం మళ్ళీ రాదని అమెరికా నమ్ముతోందట. సదరు అంతర్గత సంక్షోభాన్ని వాడుకొని అక్కడ అస్మదీయులను ప్రతిష్ఠించాలన్నది ట్రంప్ కోరిక.గత ఏడాది ఇరాన్ అణుకేంద్రాలమీద తాము దాడులు చేసిన సంగతినీ, వందలాదిమందిని మట్టుబెట్టి రాత్రికి రాత్రి వెనెజువెలా అధ్యక్షుడిని తరలించిన ఇటీవలి దృశ్యాన్ని పదేపదే గుర్తుచేస్తూ, అంతకంటే ఘాటుగా, గట్టిగా దెబ్బకొడతాను జాగ్రత్త అని ఇరాన్ పాలకులను ట్రంప్ హెచ్చరిస్తున్నారు. దాడులకు పాల్పడేముందు చర్చలకు రమ్మని ఇరాన్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అణ్వస్త్రాలకు చోటులేని, సమన్యాయబద్ధమైన ఒప్పందం కుదరాలని అంటూనే, ఆ చర్చలు జరగాలంటే ఇరాన్ ముందుగా సంపూర్ణంగా అస్త్రసన్యాసం చేయాలట. యురేనియం శుద్ధిని పూర్తిగా నిలిపివేయడం, ఖండాంతర క్షిపణుల తయారీపై అమెరికా కొత్త నిబంధనలకు తలొగ్గడం, పశ్చిమాసియాలో ఇరాన్ అనుకూల గ్రూపులకు సహాయసహకారాలు పూర్తిగా నిలిపివేయడం ఈ ఆంక్షల్లో కొన్ని. గత ఏడాది జూన్‌లో జరిగిన కొద్దిరోజుల యుద్ధంలో ఇరాన్ వందలాది క్షిపణులను ఇజ్రాయెల్‌మీదకు ప్రయోగించిన సంగతి తెలిసిందే. వాటివల్ల ప్రాణనష్టం పెద్దగా లేకున్నా, వాటిని నిలువరించి, నిరోధించి తనను తాను రక్షించుకొనే క్రమంలో ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తిని ఎక్కువగా నష్టపోయిందట. ఇజ్రాయెల్ దగ్గరున్న క్షిపణి నిరోధక వ్యవస్థల బలహీనతలు, వైఫల్యాలను కూడా ఆ దాడులు మిగతా ప్రపంచానికి ఎత్తిచూపాయి. ఈ నేపథ్యంలో, శత్రువుచేతుల్లో ఇజ్రాయెల్‌ను చేరగలిగే ఆయుధాలే లేకుండా చేయాలని ప్రయత్నం.ఇరాన్ చుట్టూ భారీ యుద్ధనౌకలను మోహరించిన ట్రంప్ అతివేగంగా లక్ష్యాన్ని సాధించాలని అనుకుంటున్నారనీ, దీర్ఘకాలం యుద్ధం కాక, ఓ పెద్ద దెబ్బతో శత్రువును కూల్చి నాయకత్వమార్పిడి కలను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నట్టు మీడియా విశ్లేషిస్తోంది. ఇరాన్‌తో వ్యవహారం ట్రంప్ మాటల్లాగా తేలిక కాదని అమెరికా సైనికాధిపతులకు తెలుసు. పాతకాలపు రష్యన్ ఆయుధాలను వాడే వెనెజువెలామీద క్షణాల్లో విజయం సాధించినట్టుగా ఇరాన్‌ను కూడా నిముషాల్లో నిర్వీర్యం చేయగలనని ట్రంప్ నమ్ముతున్నట్టుంది. ఇరాన్ స్వదేశీ, విదేశీ ఆయుధసంపత్తి గురించి బయటకు తెలిసింది తక్కువేననీ, యుద్ధం మొదలైతేగానీ చైనా అందించిన అధునాతన ఆయుధాలు బయటపడవని రక్షణరంగ నిపుణులు అంటున్నారు.తన అణుకార్యక్రమం శాంతియుతమైనదని ఇరాన్ అనడం, అణ్వాయుధాలు తయారుచేస్తోందంటూ అమెరికా పాతపాటే పాడటం అనాదిగా సాగుతోంది. 2015లో అమెరికా చొరవతో జరిగిన అణుఒప్పందం మిగతా ప్రపంచానికి యుద్ధ భయాన్ని పోగొట్టింది. ఆ తరువాత ఇరాన్ యురేనియం శుద్ధిస్థాయి హద్దులు దాటినట్టుగా ఆధారాలు కూడా లేవు. అయినా, మూడేళ్ళలోనే ట్రంప్ ఆ ఒప్పందం నుంచి వైదొలిగి, ఇరాన్‌మీద మళ్ళీ ఆంక్షలతో పరిస్థితిని మొదటికి తెచ్చారు. ఆర్థికకష్టాల్లో మునిగిన ఇరాన్ కూడా పరిమితులను ఉల్లంఘించాల్సిన పరిస్థితి కల్పించారు. పశ్చిమాసియాకు యుద్ధవిమానాలు, నౌకలు తరలిస్తున్న ట్రంప్‌కు అనేకదేశాలు చెబుతున్న హితవు చెవికెక్కడం లేదు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం అన్నివేలమందిని ఊచకోతకోసిన ఇరాన్ పాలకులు అంతసులువుగా విదేశీశక్తులకు లొంగిపోతారనుకోవడం భ్రమ. తమకు అనుకూలంగా లేని పాలకులను అమెరికా గద్దె దించేసిన దేశాలన్నీ ఆ తరువాత యుద్ధాలు, అంతర్యుద్ధాలు, జాతులూ తెగల వైరాలతో కుప్పకూలి, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన గతం ట్రంప్‌కు తెలియందేమీ కాదు.

## ఇబ్రహీంపట్నంలో హైటెన్షన్ జోగి రమేశ్ ఇంటికి నిప్పు



**మొదటిపేజీ తరువాయి** – శాంతింపజేసేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే ఇంటికి మాత్రం తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## భారత్ ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్



**మొదటిపేజీ తరువాయి** – కారిడార్, హై-స్పీడ్ రైలు కనెక్టివిటీ, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు వంటి కీలక ప్రతిపాదనలు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. వీటితో పాటు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ప్రోత్సాహం, పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించడం వంటివి ఏపీకి సానుకూల అంశాలని పేర్కొన్నారు.కేంద్ర బడ్జెట్‌లోని ఈ అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రంలో పెట్టుబడులను వేగవంతం చేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించి, ఆంధ్రప్రదేశ్ తదుపరి దశ వృద్ధికి బాటలు వేస్తామని ఆయన వివరించారు. ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.

## ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ



**మొదటిపేజీ తరువాయి** – కేసీఆర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మొత్తం విచారణ ప్రక్రియను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. విచారణ పూర్తయిన తర్వాత సిట్ బృందం కేసీఆర్ నివాసం నుంచి వెనుదిరిగింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్ విచారించింది. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్టు తెలుస్తోంది.

# పనిచేసే వారికి పట్టం.. మారకుంటే నమస్కారం

**మొదటిపేజీ తరువాయి** – ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఉన్నత పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. "ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకున్నా పార్టీ జెండా మోసిన షణ్ముఖ రెడ్డికి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. నిన్నటి వరకు సామాన్య కార్యకర్తగా ఉన్న ఆయన, ఈరోజు పార్లమెంట్ అధ్యక్షుడయ్యారు. ఇదే తెలుగుదేశం పార్టీలో ఉండే గుర్తింపు" అని పేర్కొన్నారు. తన కష్టాన్ని గుర్తించినందుకు షణ్ముఖ రెడ్డి భావోద్వేగానికి గురై అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ని సంక్షోభాలు ఎదురైనా టీడీపీ నిలదొక్కుకోగలిగిందని, అందుకే ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనంతటి మెజారిటీని కూటమికి కట్టబెట్టారని చంద్రబాబు అన్నారు. వైసీపీ కనీసం ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందని, ప్రజలతో మమేకమైతేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. "నా రాజకీయ జీవితం 2028 నాటికి 50 ఏళ్లకు చేరుకుంటుంది. ప్రజల




భవిష్యత్, వారి సంక్షేమం కోసమే నా ప్రతి ఆలోచన ఉంటుంది" అని తెలిపారు.కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ, ఒకే సీజన్‌లో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, లేదంటే ఈ ప్రాంతం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేదని గుర్తుచేశారు. "రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పాం.. చేసి చూపించాం. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉంది. దీనిని మరింత అభివృద్ధి చేస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి వంటి నగరాలు దేశానికి అవసరమని ఆర్థిక సర్వే కూడా చెప్పిందని గుర్తుచేశారు.తన పాలనా శైలిని వివరిస్తూ, "నేను నిర్మొహమాటంగా మాట్లాడతా, వాస్తవాలు చెబుతా. తప్పులు సరిచేసుకోమని సూచిస్తా. అప్పటికీ పనితీరు మార్చుకోకపోతే నమస్కారం పెట్టి పక్కన పెడతాను" అని గట్టిగా హెచ్చరించారు. ప్రతి వారం ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తున్నానని, కార్యకర్తలకు, తనకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా టెక్నాలజీని వినియోగిస్తున్నామని చెప్పారు. కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కుప్పంలోని 150 చెరువులను నింపినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాలని కోరారు.

# రూ.53.47లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి** – వచ్చే ఏడాది 0.1 శాతం తగ్గించాలని లక్ష్యం నిర్దేశించు కున్నారు.ఇక రాబడులకు సంబంధించి ప్రతి రూపాయిలో రుణాలు ద్వారానే అత్యధికంగా 24 పైసలు సేకరించనున్నట్లు తెలిపారు. ఆదాయ పన్ను ద్వారా 21 పైసలు, కార్పొరేట్ పన్నుల ద్వారా 18 పైసలు, జీఎస్టీ, ఇతర పన్నుల ద్వారా 15 పైసలు, పన్నేతర ఆదాయం 10 పైసలు, కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా 6 పైసలు, కస్టమ్స్ సుంకాల ద్వారా 4 పైసలు, రుణేతర మూల ధన రాబడుల ద్వారా 2 పైసలు వస్తాయని అంచనా వేశారు.

**రంగాలవారీగా కేటాయింపులు**

- రవాణా రంగం – రూ.5,98,520 కోట్లు
- రక్షణ రంగం – రూ.5,94,585 కోట్లు
- గ్రామీణాభివృద్ధి రంగం – రూ.2,73,108 కోట్లు
- హోంశాఖ కార్యకలాపాలు రూ.2,55,234 కోట్లు
- వ్యవసాయ అనుబంధ రంగాలు – రూ.1,62,671 కోట్లు
- విద్యారంగం – రూ.1,39,289 కోట్లు
- ఇంధన రంగం – రూ.1,09,029 కోట్లు
- వైద్య, ఆరోగ్యం – రూ.1,04,599 కోట్లు
- పట్టణాభివృద్ధి – రూ.85,522 కోట్లు
- ఐటీ, టెలికాం – రూ.74,560 కోట్లు
- వాణిజ్యం, పరిశ్రమలు – రూ.70,296 కోట్లు
- సాంఘిక సంక్షేమం – రూ.62,362 కోట్లు
- శాస్త్ర సాంకేతిక రంగాలకు – రూ.55,756 కోట్లు
- పన్ను నిర్వహణ – రూ.45,500 కోట్లు
- ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ – రూ.22,119
- ఆర్థిక నిర్వహణ – రూ.20,649 కోట్లు
- ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి – రూ.6,812 కోట్లు

**బడ్జెట్లో రూపాయి రాక**


- అప్పులు – 24 శాతం
- ఆదాయ పన్ను – 21 శాతం
- కార్పొరేషన్ పన్ను – 18 శాతం
- జీఎస్టీ, ఇతర పన్నులు – 15 శాతం
- పన్నేతర ఆదాయం – 10 శాతం
- ఎక్సైజ్ డ్యూటీ – 6 శాతం
- కస్టమ్స్ ఆదాయం – 4 శాతం
- రుణం లేని మూలధనం – 2 శాతం

**రూపాయి పోక**

- రాష్ట్రాలకు పన్ను చెల్లింపులు – 22 శాతం
- రుణాలకు వడ్డీ చెల్లింపులు – 20 శాతం
- కేంద్ర ప్రభుత్వ పథకాలు – 17 శాతం
- రక్షణ రంగం – 11 శాతం
- కేంద్ర ప్రాయోజిత పథకాలు – 8 శాతం
- ఆర్థిక సంఘం, ఇతర బదిలీలు – 7 శాతం
- ఇతర ఖర్చులు – 7 శాతం
- ప్రధాన సబ్సిడీలు – 6 శాతం
- పౌర పింఛన్లు – 2 శాతం

**బడ్జెట్‌లో 43శాతం పథకాలకే**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన జంబో బడ్జెట్‌ను రూ.53.47కోట్లతో పద్దు ప్రతిపాదించారు. అయితే ఈసారి బడ్జెట్‌లో పథకాలకు అగ్రతాంబూలం ఇచ్చారు. మొత్తం బడ్జెట్‌లో 43శాతం నిధులను కేవలం స్కీమ్స్ కోసమే కేటాయించడం గమార్హం.కేంద్రం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.23.21లక్షల కేట్లను వివిధ రకాల పథకాల కోసం కేటాయింపులు చేసింది. ఇది మొత్తం బడ్జెట్‌లో 43శాతం. స్కీమ్స్‌కు మోదీ సర్కారు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో ఈ కేటాయింపులే స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ పథకాలను రెండు వర్గాలుగా కేంద్రం విభజించింది. అందులో ఒకటి సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్, రెండోది కేంద్ర ప్రాయోజిత పథకాలు ( సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్). ఈ రెండింటిలో కూడా సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌కు ఏకంగా 17.22 లక్షల కోట్లు కేటాయించింది.సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌ను సైతం కేంద్రం ఐదు రకాలుగా విభజించింది. 1. జనరల్ సర్వీస్, 2. ఎకానమిక్ సర్వీస్, 3. సోషల్ సర్వీస్, 4. సబ్సిడీ, 5. ఇతర స్కీమ్స్




ఉన్నాయి. వీటిలో సబ్సీడీల కోసం ఏకంగా రూ.4.55లక్షల కోట్లను కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో ఫుడ్ సబ్సిడీ కోసం రూ.2.28 లక్షల కోట్లు కాగా, ఫెర్టిలైజర్ సబ్సిడీ కోసం రూ. 1.71లక్షల కోట్లను కేటాయించింది. అలాగే, పెట్రోలియం సబ్సిడీ కోసం రూ. 0.12లక్షల కోట్లను ప్రతిపాదించింది.

**రాష్ట్రాలకు రూ.4.41లక్షల కోట్లు**

ఈ బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయాన్ని కూడా ప్రస్తావించింది. రూ.4.41లక్షల కోట్లను 2026-27 ఆర్థిక సంవత్సరంలో పన్నులు, ఇతర రూపాల్లో ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందులో 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.29 లక్షల కోట్లు ఉంటాయని ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

**వడ్డీలకు రూ.14.04లక్షల కోట్లు**

2026-2027 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం వడ్డీ చెల్లింపులకు భారీగా కేటాయింపులు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14.04లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే కేటాయించినట్లు కేంద్రం వెల్లడించింది. అలాగే, జీతాల కోసం రూ.1.66లక్షల కోట్లు, పెన్షన్స్ కోసం రూ.2.96లక్షల కోట్లను కేంద్రం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

# వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్‌గా కేంద్ర బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి** – కురిపించారు."చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టాం. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశాం. కేంద్ర బడ్జెట్ ద్రవ్యలోటును నియంత్రిస్తుంది. మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో మరింత ఊతమిచ్చాం. లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి భారత్ ఎదిగింది. యువశక్తిని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉంది. యువతకు గేమింగ్, టూరిజం, క్రీడా సౌకర్యాలు కల్పించాం. వికసిత్ భారత్ ప్రయాణం వేగవంతానికి బడ్జెట్ తోడ్పాటును అందిస్తుంది. సంస్కరణలకు బడ్జెట్ నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. భారత్‌ను డేటా సెంటర్‌గా మార్చేందుకు ట్యాక్స్ హాలిడే ఉపయోగపడుతుంది. ఇది భారత్‌ను డేటా సెంటర్ హబ్‌గా మారుస్తుంది. ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్ మరింత దోహదం చేస్తుందని నరేంద్ర మోదీ తెలిపారు.ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కొనియాడారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ, ఆ ఎక్స్‌ప్రెస్‌కు బడ్జెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయని



చెప్పారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ ప్రశంసించారు."మౌలిక సదుపాయలను బలోపేతం చేసేందుకు ఈ బడ్జెట్‌లో అనేక చర్యలు తీసుకున్నాం. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, దేశవ్యాప్తంగా జలమార్గాల విస్తరణ, హై-స్పీడ్ రైలు కారిడార్, టైర్-2, టైర్-3 నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, నగరాలకు బలమైన ఆర్థిక పునాదిని అందించేందుకు మున్సిపల్ బాండ్లకు ప్రోత్సాహం. ఈ చర్యలన్నీ వికసిత భారత్ వేగాన్ని మరింత పెంచుతాయి. ఈ బడ్జెట్ 2047 వికసిత్ భారత్‌కు బలమైన ఆధారం. భారత్ ఏ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై సవారీ చేస్తుందో దానికి ఈ బడ్జెట్‌తో కొత్త శక్తి, వేగం లభించనున్నాయి. చారిత్రక సంస్కరణలు ఆంక్షాలతో నిండిన దేశీయ సాహసిక్, నైపుణ్యం కలిగిన యువతకు ఆకాశమే హద్దుగా అవకాశాలు కల్పిస్తాయి. ఏ దేశానికైనా గొప్ప బలం వారి పౌరులే. ఈ మధ్య కాలంలో మా పౌరుల సామర్థ్యాలను పెంచేందుకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాం. అంతర్జాతీయంగా భారత్ పాత్రను ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుంది. కేంద్ర బడ్జెట్ నారీశక్తిని ప్రతిబింబిస్తుంది. బడ్జెట్‌లో ఈశాన్య ప్రాంతాల పర్యాటకంపై దృష్టి పెట్టాం."వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ముఖ్యంగా డెయిరీ రంగం, ఫిషరీస్‌కు అధిక ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. వీటితో పాటు కొబ్బరి, ఎర్రచందనం రైతుల కోసం అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇంకా ఈ బడ్జెట్‌లో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాల పర్యాటకంపై దృష్టి పెట్టామని అన్నారు.

# కెమెరా జర్నలిస్ట్ దాడిని ఖండించిన కేంద్ర మంత్రులు

**మొదటిపేజీ తరువాయి** – బీఆర్ఎస్ భవన్ దగ్గరకు కవరేజ్ కోసం వెళ్లిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలకు చెందిన కెమెరా జర్నలిస్ట్ పవన్‌పై ఇవాళ(ఆదివారం) బీఆర్ఎస్ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు వేర్వేరుగా ఓ ప్రకటన విడుదల చేశారు.మీడియా ప్రతినిధిపై దాడి మంచి సంప్రదాయం కాదని తెలిపారు. దాడి చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందరూ దీన్ని ఖండించాలని కోరారు. బాధ్యతగల రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గతంలో మీరు పదేళ్లు ప్రభుత్వంలో ఉన్నారని.. ఇది మంచి సంస్కృతి కాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ గూండాల తీరు బాధకరం: బండి సంజయ్**

తెలంగాణ భవన్ వద్ద ఏబీఎన్ సిబ్బందిపై బీఆర్ఎస్ కార్యాకర్తల దాడి అమానుషమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కవరేజ్ నిమిత్తం వెళ్లిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలకు చెందిన కెమెరా జర్నలిస్ట్ పవన్‌పై బీఆర్ఎస్ గూండాల తీరు బాధకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాది కీలక పాత్ర అని ఉద్ఘాటించారు. ప్రజల కోసం పనిచేసే నాలుగవ స్తంభంపై బీఆర్ఎస్ దాడులు చేస్తామంటే చూస్తూ ఉరుకోమని బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు.

**దాడి అమానుషం: మంత్రి తుమ్మల**

తెలంగాణ భవన్ వద్ద ఏబీఎన్ సిబ్బందిపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడి అమానుషమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. కవరేజ్ నిమిత్తం వెళ్లిన ఏబీఎన్ సిబ్బందిపై బీఆర్ఎస్ గూండాల తీరు బాధాకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియాది కీలక పాత్ర



అని చెప్పుకొచ్చారు. ప్రజల కోసం పనిచేసే నాలుగవ స్తంభంపై బీఆర్ఎస్ దాడులు చేస్తామంటే చూస్తూ ఉరుకోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# సిట్ ఒక "సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్"

**మొదటిపేజీ తరువాయి** – "సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్" అన్నట్లుగా వారి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో పరాకాష్ఠ అని హరీశ్ రావు అభివర్ణించారు. ఈ నోటీసుల వెనుక చట్టం లేదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, రాజకీయ ప్రతీకారం మాత్రమే ఉన్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా, ఆయన నివాసం ఎక్కడ ఉందో రాష్ట్రమంతటికీ తెలిసినా, నందినగర్‌లోని ఇంటి గోడకు నోటీసులు అంటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.పాలన చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ఈ సిట్ డ్రామా ఆడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్



అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధం కానప్పటికీ, అనుసరించిన విధానం రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. కేసీఆర్ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా, భారత పౌరుడిగా దర్యాప్తునకు పూర్తిగా సహకరిసున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని, గజ్వేల్ నుంచి హైదరాబాద్ వరకు వేలాది మందిని మోహరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల కష్టాలు, యువత ఉద్యోగాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలను గాలికొదిలి, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు.

# సారపాక మేజర్ గ్రామపంచాయతీలో అభివృద్ధి దూకుడు నెల రోజుల్లోనే సంక్షేమ, మౌలిక సదుపాయాల విస్తరణ



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 01 (వార్త సంధ్య):** సారపాక మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం కొలువుతీరిన నెల రోజుల్లోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతోంది. గ్రామంలో మౌలిక వసతుల మెరుగుదల దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తోంది. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారికి యూనిఫామ్, భీమా సౌకర్యాలు కల్పించడంతో పాటు వేతనంలో నెలకు రూ.2,000 పెంపు చేశారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సహకారంతో రూ.2 కోట్ల 90 లక్షల వ్యయంతో 62 సీసీ రోడ్లు, ఈజీఎస్ గ్రాంట్ ద్వారా రూ.60 లక్షలతో మరో 13 సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అదనంగా పాలకవర్గ సమావేశంలో రూ.1 కోటి 15 లక్షల వ్యయంతో మరో 23 రోడ్ల నిర్మాణానికి తీర్మానం చేశారు. గత దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పైపులైన్ల సమస్యపై దృష్టి సారించి ఎస్టిమేషన్లు సిద్ధం చేసి నెలలోపే సుమారు 60 శాతం రిపేర్ పనులు పూర్తి చేశారు. డ్రైనేజీ వ్యవస్థ బలోపేతానికి 103 డ్రైనేజీలకు ఎస్టిమేట్లు పంపి సాంక్షన్ దిశగా అడుగులు వేస్తున్నారు.డీఎం యాప్, టీ గ్రాంట్ నిధులతో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను భాస్కర్ నగర్, సుందరయ్య నగర్‌లలో ఏర్పాటు చేశారు. లో వోల్టేజ్ సమస్య నివారణకు అదనపు ట్రాన్స్ఫార్మర్లు, వీధి దీపాల ఏర్పాటు చేశారు. భద్రాచలం బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టారు

# ఎన్నికల కోడ్ తో ప్రజావాణి రద్దు



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 1 (వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఈ నిర్ణయం తీసు కున్నట్లు పేర్కొన్నారు. కోడ్ ముగిసే వరకు ప్రజల నుంచి వినతుల స్వీకరణ ఉండదని, ఆ తర్వాతే యథా విధిగా కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మార్పును జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

# శ్రీ గుట్ట వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం



**రాయికల్ ఫిబ్రవరి 1(వార్త సంధ్య):** రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామా శివారులోని అడవిలో గల గుట్టలో స్వయంభువుగా వెలసిన శ్రీ గుట్ట వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రోజున గ్రామస్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. రేగుంట సాతారం, రామారావు పల్లె, గుండంపల్లి ,గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.. చిన్న పెద్ద లేకుండా అందరూ గుట్ట పైకి వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.. అనంతరం భక్తులకు అన్నదానము నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, మాజీ సర్పంచ్లు మరిపెల్లి నారాయణ గౌడ్, సామల్ల లావణ్య వేణు, వార్డు సభ్యులు, నాయకులు మోర హనుమాన్లు, ఏనుగు మల్లారెడ్డి, కాటిపెల్లి గంగారెడ్డి, కొమ్ముల ఆదిరెడ్డి, మిట్టపల్లి రాంరెడ్డి, మగ్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, కొప్పెల మైపతి రెడ్డి, పుట్టుకం రాజారెడ్డి, ఓరగంటి లక్ష్మణ్, నాగిరెడ్డి నర్సారెడ్డి, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు సబ్ డివిజన్ వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు.




**ఇల్లందు ,ప్రతినిధి ఫిబ్రవరి 1 (వార్త సంధ్య):** పోలీసు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగసభలు నిర్వహించవద్దు. డిఎస్పి యు. వెంకన్న బాబు శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఇల్లందు వ్యాప్తంగా ఫిబ్రవరి 28 వ తేది వరకు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని ఇల్లందు డిఎస్పి యు. వెంకన్న బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవు అని తెలిపారు. బాణాసంచా, డీజే లు ఉపయోగించవద్దు అన్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల హాస్టల్‌లో కలకలం మాడిపోయిన అన్నం, పురుగులు పడ్డ కూరలు తల్లిదండ్రుల ఆగ్రహం



**మునుగోడు :ఫిబ్రవరి -01 (వార్త సంధ్య) :** మునుగోడు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి.హాస్టల్‌లో విద్యార్థులకు మాడిపోయిన అన్నం,పురుగులు పడ్డ కూరలు వడ్డిస్తున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు.ఈ విషయాన్ని ప్రశ్నించేందుకు ఆదివారం హాస్టల్‌కు చేరుకున్న తల్లిదండ్రులు, విద్యార్థుల ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా తినరాని ఆహారం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నిర్లక్ష్య ధోరణి వల్ల తమ పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని వారు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ,క్యాంటీన్ కాంట్రాక్టర్‌ను వెంటనే తొలగించాలి,ఈ ఘటనకు బాధ్యత వహించాల్సిన హాస్టల్ ప్రిన్సిపల్ సంధ్యారాణి తక్షణమే సస్పెండ్ చేయాలి అని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు

# శ్రీ కాళహస్తీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత వాయు లింగేశ్వరుడి సేవలో – పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 01 ( వార్త సంధ్య ) –** మాఘమాసం ను పురస్కరించుకొని జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం తంబళ్లపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆయన వెంట స్టేట్ వైసీపీ జాయింట్ సెక్రెటరీ, రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్ రెడ్డి, సురేందర్ రెడ్డి లు విచ్చేసి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రాంగణం వద్దకు విచ్చేసిన వీరిని ఆలయ అధికారులు ఆలయ గౌరవ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్చారణ మధ్య పూర్ణకుంభాలతో ప్రదక్షిణానంతరం ఆలయంలోనికి స్వాగతించారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద వేద పండితుల దివ్య హస్తాలతో వేద ఆశీర్వచనం స్వీకరించారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి అమ్మవారి వస్త్రాలను, స్వామివారి ప్రతిమను అందజేశారు. ఈ మేరకు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డికి ఆలయ వేద పండితుడు ఆలయ ప్రాముఖ్యత గురించి వివరించారు. భారతదేశంలోని పంచభూత లింగాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన వాయులింగం ఒకటని అది కూడాను ఆంధ్రప్రదేశ్ లోనే ఉందని ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు స్వయంగా కొలువుదీరి ఉంటాడని, దీనికి నిదర్శనం ఈ లింగానికి ప్రాణం ఉండడమేనని అంటారు. ఆలయం గర్భగుడిలో ఉండే అన్ని దీపాలు నిశ్చలంగా ఉన్నా శివలింగం ఎదురుగా ఉండే అఖండ జ్యోతి మాత్రం ఎప్పుడూ రెపరెపలాడుతూ ఉంటుందని వాయు లింగంగా కొలువైన స్వామి వారి ఉఛ్వాశ నిశ్వాసల గాలి కారణంగా దీపం ఎల్లప్పుడూ రెపరెపలాడుతుందని నమ్ముతారని వేద పండితులు వివరించారు. శ్రీఅంటే సాలీడు, కాళము అంటే సర్పము, హస్తి అంటే ఏనుగు. ఈ మూడు మూగ జీవుల చేత పూజలందుకున్న కారణంగా ఈ క్షేత్రానికి శ్రీకాళహస్తి అని పేరు వచ్చినట్లు పురాణ కథనమని సాలెపురుగు, పాము, ఏనుగుల ఆత్మలను తనలో విలీనం చేసుకుని స్వామి స్వయంభువుగా ఇక్కడ కొలువయ్యారని ఈ క్షేత్రానికి దక్షిణ కైలాసం, సద్యోముక్తిక్షేత్రం, శివానందైక నిలయం, సత్య మహా భాస్కర క్షేత్రం అనే వివిధ పేర్లు ఉన్నాయని ఇక్కడ అమ్మవారు జ్ఞాన ప్రసూనాంబ తూర్పు ముఖంగా, స్వామి వారు శ్రీకాళహస్తీశ్వరుడు పశ్చిమాభిముఖంగా దర్శనం ఇస్తారని గణపతి ఉత్తర దిక్కుగా, దక్షిణామూర్తి దక్షిణ దిక్కుగా ఉంటారని పేద పండితుడు ద్వారకానాథ్ రెడ్డి వివరించారు. ఈ ఆలయంలో తూర్పు ద్వారం గుండా ప్రవేశించి మొదట పాతాళ వినాయకుణ్ణి దర్శించుకుని తరువాత శ్రీకాళహస్తీశ్వరున్ని భక్తులు దర్శించుకుంటారు. పాతాళ గణపతితో పాటు ఈ క్షేత్రంలో వల్లభ గణపతి, మహాలక్ష్మి గణపతి, సహస్ర లింగేశ్వర దేవాలయాలు కూడా ఇక్కడ కనిపిస్తాయి. దేశంలోని అతిపురాతన క్షేత్రాల్లో ఒకటైన ఈ దేవాలయంలో నిర్మాణ శైలి నుంచి మూల విరాట్ వరకూ అడుగడుగునా ఆసక్తికర విషయాలు దాగి ఉన్నాయి.

**భక్తుడికే అగ్రతాంబూలం:**

కాళహస్తి గోపురం.. సాధారణంగా భక్తుడు ఎప్పుడూ భగవంతుని పాదాల చెంతన ఉంటాడు. కానీ శ్రీ కాళహస్తిలో ఇది భిన్నంగా కనిపిస్తుంది. పరమేశ్వరుడి పరమ భక్తుడైన కన్నప్పకు కొండపైన దేవాలయం ఉంటే, శ్రీకాళహస్తీశ్వరుడికి పాదాల కింద ఆలయం ఉంటుంది. అందుకే పరమేశ్వరున్ని భక్త వల్లభుడని కూడా పిలుస్తారు. మహాశివరాత్రి రోజున ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాల్లో తొలి పూజను కొండపై ఉన్న కన్నప్ప ఆలయంలో చేయడం విశేషం. పరమేశ్వరుడికి మహా భక్తులైన రోమస మహర్షి, ధూర్జటిల దేహాలను కూడా శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో సమాధి చేశారు. ఆలయం రాజద్వారం దాటే గడప కింద వారి దేహాలను ఉంచారు. వేశ్య కన్యలు, యాదవరాజు, వశిష్టుడు ఇలా ఎన్నో కథలు ఈ క్షేత్ర మహత్యంతో పెనవేసుకుని ఉన్నాయి.

**రాహుకేతు శాంతి పూజలు:**

శ్రీకాళహస్తి క్షేత్రం అనగానే మొట్ట మొదటి గుర్తొచ్చేది రాహు కేతు శాంతి పూజలు. శ్రీకాళహస్తీశ్వరుడి ఉండే నవగ్రహ కవచం ద్వారా రాహు కేతువులతో పాటు గ్రహాలన్నీ పరమేశ్వరుడి అదుపులో ఉంటాయని నమ్ముతారు. ఇక జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి కూడా కేతువు వడ్డానంగా ఉంటాడు. అందువల్ల ఈ క్షేత్రంలో రాహు కేతు శాంతి పూజలను ప్రముఖంగా నిర్వహిస్తుంటారు. ఆలయంలో జరిగే ఈ శాంతి పూజల్లో ఒకే సారి వందల సంఖ్యలో ప్రజలు పాల్గొంటారు. సాధారణంగా శైవ క్షేత్రాల్లో నవగ్రహ మండపం విడిగా ఉంటుంది. కానీ ఇక్కడ నవగ్రహాలన్నీ కాకుండా కేవలం శనీశ్వరుడికి మాత్రమే మండపం ఉంటుంది. శని త్రయోదశి రోజున ఇక్కడ శనీశ్వరుడికి చేసే అభిషేకాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

**చెంగల్వ రాయుని ఆలయం:**

శ్రీకాళహస్తిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని వల్లీదేవసేన సమేత చెంగల్వ రాయునిగా కొలుస్తారు. ఇక్కడ తప్ప దేశంలో మరెక్కడా సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఈ పేరు ఉండదు. అదే విధంగా ఆలయంలో ఉండే మరో ప్రధాన ఆకర్షణ సహస్ర నామ మండపం. శ్రీకాళహస్తి ఆలయంలో ఎక్కడా ఆకాశం కనిపించదు. కానీ ఈ మండపంలో ప్రత్యేకంగా కేటాయించిన గుర్తుల వద్ద నిలబడి చూస్తే స్వామి వారి శిఖరం, అమ్మవారి శిఖరం, భక్త కన్నప్ప ఆలయ శిఖరాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ మండపంలో ధర్మరాజు, యమధర్మరాజు, చిత్ర గుప్తుడులు ప్రతిష్టించిన శివలింగాలు కూడా కనిపిస్తాయి. ఇలా ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలతో శ్రీకాళహస్తి క్షేత్రం ఆధ్యాత్మిక, పర్యాటక గమ్యస్థానంగా మారింది.

# తంగడపల్లి శివాలయంలో ఆధ్యాత్మిక మహోత్సవం అభిషేకాలు, కల్యాణోత్సవాలతో భక్తుల మహా సందడి

**శివపార్వతుల కల్యాణోత్సవం, హోమాలు, నవగ్రహ పూజలతో పునీతమైన గ్రామ వాతావరణం**

**మహా ప్రసాద పంపిణీతో సంపూర్ణమైన శివాలయ ఉత్సవాలు**

**ప్రధాన అర్చకుల నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు**

**ఆలయ ప్రాంగణం నిండా తరలివచ్చిన భక్తజనం**



**చేవెళ్ల ఫిబ్రవరి 1 ( వార్త సంధ్య ):** రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, తంగడపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శివాలయంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక మహోత్సవం గ్రామ చరిత్రలో ఒక విశేష ఘట్టంగా నిలిచింది. ఉదయం నుంచే ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, శివ నామస్మరణతో మార్మోగాయి. స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, కల్యాణోత్సవం, హోమాలు, నవగ్రహ పూజలు గ్రామాన్ని సంపూర్ణంగా ఆధ్యాత్మిక శక్తితో నింపాయి. ప్రభాతకాలం నుంచే స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచామృతాలు, గంగాజలంతో మహాభిషేకాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలతో పాటు డమరుక నాదం, శంఖారావం ఆలయాన్ని ప్రతిధ్వనింపజేశాయి. అభిషేక దర్శనానికి తంగడపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాలు, మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీర్ఘకాలం దర్శనార్థం వేచి ఉన్నారు.అభిషేకాల అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ కల్యాణోత్సవం భక్తులకు ఒక అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని అందించింది. శివపార్వతుల దివ్య కల్యాణాన్ని దర్శించడం ద్వారా సర్వసౌఖ్యాలు, శుభఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. కల్యాణోత్సవం అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించి, అనంతరం నవగ్రహ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ పూజల ద్వారా గ్రామ ప్రజలకు శాంతి, ఆరోగ్యం, పంటల సమృద్ధి, సుఖసంతోషాలు కలగాలని అర్చకులు ప్రత్యేకంగా సంకల్పించారు. హోమాగ్ని జ్వాలల మధ్య సాగిన ఈ కార్యక్రమాలు ఆలయ ప్రాంగణాన్ని పవిత్రతతో నింపాయి. ఈ మహోత్సవాన్ని దేవాలయ ధర్మ కర్త శివానందశీ గారి ఆధ్వర్యంలో పద్మజ, శశి కిరణ్, అక్షత , రవి కిరణ్, పవిత్ర, సోమనాథ్, మాధురి తదితరులు అత్యంత భక్తి శ్రద్ధలతో, శాస్త్ర నియ మాలను పాటిస్తూ నిర్వహిం చారు. వారి సేవలు, నిబద్ధత భక్తుల మన్ననలను పొందాయి. అన్ని పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ నిర్వాహకులు మహా ప్రసాదాన్ని విస్తృతంగా పంపిణీ చేశారు. క్రమబద్ధమైన ఏర్పాట్లతో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా వేలాది మంది భక్తులు మహా ప్రసాదాన్ని స్వీకరిం చారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి తంగడపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. ఆలయం చుట్టూ ఉన్న వీధులన్నీ పండుగ వాతావరణాన్ని తలపిస్తూ, శివ నామ స్మరణతో మార్మోగాయి. మొత్తంగా తంగడపల్లి శివాలయంలో నిర్వహించిన ఈ అభిషేకాలు, కల్యాణోత్సవం, హోమాలు, నవగ్రహ పూజలు గ్రామ ప్రజల హృదయాల్లో ఆధ్యాత్మిక శాంతిని నింపాయి. ఇలాంటి మహోత్సవాలు నిరంతరం కొనసాగాలని, గ్రామం ఎల్లప్పుడూ శుభశక్తులతో పరిపూర్ణంగా

# గ్రామస్తులతో మమేకమైన గడికోట శ్రీకాంత్ రెడ్డి..

**జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే సంక్షేమ పథకాలన్నీ అందేవి..**

**కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక అవేవి అందక ఇక్కట్లు**




**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 01 ( వార్త సంధ్య ) :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. తొలుత గాలివీడు మండల కేంద్రమైన గుండ్లచెరువు గ్రామ పంచాయితీ పసలవాండ్లపల్లె గ్రామంలో ప్రజలు, మహిళా రైతు కూలీలతో ఆదివారం మమేకమయ్యారు. పలు సమస్యలను అడిగి విచారించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలని అందుతున్నాయా అంటూ విచారించారు. గ్రామస్తులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఉండుంటేనే బాగుండేదని ఆయన పాలనలో సంక్షేమ పథకాలన్నీ క్రమం తప్పకుండా అందాయని కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక ఏ ఒక పథకం కూడా మాకు అందలేదని అన్ని పథకాలు ఆగిపోయాయని శ్రీకాంత్ రెడ్డి కి వివరించారు. రైతన్నలు పండిస్తున్న పంటలకు సరైన గిట్టు బాటు ధరలు లేక విలవిలలాడుతున్నామని కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని పిల్లలను చదివించలేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని మా ప్రాంతాల్లో వ్యవసాయం పైనే ఆధారపడి కొన్ని వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పండించిన పంటలు చేతికొచ్చిన వాటికి గిట్టుబాటు ధరలు కల్పించలేని దద్దమ్మ ప్రభుత్వం గా కూటమి పాలిస్తా ఉందని మహిళా రైతు కూలీలు విమర్శించారు. వైసీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. నియోజకవర్గ పర్యటనలో ఉన్న శ్రీకాంత్ రెడ్డి కి మండల వైసీపీ శ్రేణులు సమాచార మందించారు. ఆయన తక్షణమే గుండ్లచెరువు గ్రామపంచాయతీ దుగ్గన్నవాండ్లపల్లి గ్రామానికి చెందిన మృతుడు వెంకట రమణారెడ్డి ఇంటికెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తోడుగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు. అక్కడనుండి తిరుగు ప్రయాణమై గుండ్ల చెరువు గ్రామపంచాయతీ పసలవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ బీసీ నాయకుడు శ్రీరాములు మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. నేరుగా శ్రీరాములు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ఆప్యాయంగా పలకరించారు. శ్రీరాములును పరామర్శించారు. ధైర్యంగా ఉండమంటూ నిండు మనసుతో భరోసా కల్పించారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం.



**టేకులపల్లి ,ప్రతినిధి ఫిబ్రవరి 1 (వార్త సంధ్య):** టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ రైతు వేదిక నందు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం నేడు మధ్యాహ్నం 02:00 గ"లకు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేయనున్నారు.కావున మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మండల కమిటీ వారు తెలియజేశారు.

# అంబేద్కర్ ఆశయాలతో విజయ శిఖరాలను అధిరోహించిన కోట లక్ష్మణరావు



**తిరువూరు ఫిబ్రవరి 01 (వార్తసంధ్య):** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కోట లక్ష్మణరావు మరోసారి గ్రామ గౌరవాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. శ్రీ కోట మార్కండేయ జిల్లా పరిషత్ హైస్కూల్ పెనుగొలను లో 20082009 బ్యాచ్‌లో విద్యాభ్యాసం చేసిన లక్ష్మణరావు, నిరంతర కృషి, అంకితభావం, పట్టుదలతో ఇటీవల విడుదలైన బ్యాంక్ ఉద్యోగ ఫలితాల్లో ఇండియన్ బ్యాంక్ ప్రొబిషనరీ ఆఫీసర్‌గా (అసిస్టెంట్ మేనేజర్) ఎంపికయ్యారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన లక్ష్మణరావు, తల్లిదండ్రులు కోట నారాయణ, బుజ్జి దంపతుల పెద్ద కుమారుడిగా, చిన్ననాటి నుంచే చదువును తన ఆయుధంగా మార్చుకున్నారు. ఆర్థిక పరిమితులు, పరిస్థితుల ఒత్తిడులు ఎదురైనా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను మార్గదర్శకంగా చేసుకుని "విద్యే విముక్తి" అనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారు. విద్యలో ఎప్పుడూ వెనక్కి తగ్గని విక్రమార్కుడిలా, ఒకసారి లక్ష్యం నిర్ధారించుకున్నాక దాన్ని సాధించే వరకు విశ్రమించని తత్వం ఆయనను ఈ స్థాయికి చేర్చింది. పాఠశాల విద్య నుంచి పోటీ పరీక్షల వరకూ ప్రతి దశలో క్రమశిక్షణ, నిరంతర శ్రమే ఆయన్ని ముందుకు నడిపించాయి.గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ బ్యాంక్‌లో అధికారిగా ఎంపిక కావడం పెనుగొలను గ్రామానికి మాత్రమే కాదు, మొత్తం గంపలగూడెం మండలానికి గర్వకారణంగా మారింది. లక్ష్మణరావు విజయం నేటి యువతకు, ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు "పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమే" అనే సందేశాన్ని స్పష్టంగా అందిస్తోంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, స్నేహితులు, పూర్వ విద్యార్థులు లక్ష్మణరావును అభినందిస్తూ, ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు

# వంగాల గ్రామంలో అకస్మాత్తుగా మృతి చెందిన పాడి ఆవు, తల్లడిల్లిన రైతు గుండె



**యాదాద్రి భువనగిరి జిల్లా, ఫిబ్రవరి 01, (వార్త సంధ్య) :** యాదాద్రి జిల్లా, గుండాల మండలంలోని వంగాల గ్రామంలో రైతు చిప్పలపల్లి యాదయ్య కు చెందిన ఆవు రోజులాగానే మేతకు తీసుకువెళ్లగా ఉన్నట్టుండి అకస్మాత్తుగా కింద పడి మృతి చెందింది , ఎన్నో సంవత్సరాల నుండి తమ వ్యవసాయ పనులకు ఎంతో అండగా ఉన్న ఆవు చనిపోవడంతో రైతు తీవ్ర ఆవేదన చెందాడు, ఆ గ్రామంలో ప్రతి ఒక్కరూ సంక్రాంతికి , ఇతర పండుగలకు ఆ ఆవు పంచికం, పేడ తీసుకువెళ్ళేవారు, అలాంటి ఆవు మృతితో గ్రామస్తులు కూడా విచారం వ్యక్తం చేశారు, సుమారు 50వేళ విలువైన ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబం కష్టాల్లోకి వెళ్ళింది, ప్రభుత్వం ఆదుకోవాలని ఆ రైతు కుటుంబం వేడుకుంది

# దివ్యాంగుల సంక్షేమం కోరుతూ వినతిపత్రం



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి01 (వార్త సంధ్య) :** విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల మరియు హిజ్రాల వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంబంధిత కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామిని,జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు కలిసి దివ్యాంగుల సమస్యలు గురించి చర్చించారు.దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు,కొత్త పింఛన్ లు, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లో దివ్యాంగులందరికి జాబ్ కార్డు లు ఇప్పించి పనికి హాజరు కల్పించి వారి అభివృద్ధికి సహకరించడానికి చైర్మన్ కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగులకు కార్యాలయం కూడా అతి త్వరలో ఏర్పాటు చేస్తామని,అలాగే దివ్యాంగుల అవసరాలకు అన్ని రకాలుగా సహాయ పడతామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విలువైన సమయాన్ని వెచ్చించి సమస్యలు విని పరిష్కారస్తానని చెప్పినందుకు చైర్మన్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

# మునుగోడు మండలంలోని 18 గ్రామాలలో కుమ్మరి గ్రామశాఖ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక



**మునుగోడు: ఫిబ్రవరి -01 (వార్త సంధ్య) :** మునుగోడు మండలంలోని మార్కెట్ యార్డ్ నందు మునుగోడు నియోజకవర్గ కుమ్మరి సంఘం కన్వీనర్ సిలువేరు సత్తయ్య అధ్యక్షతన,మండల కన్వీనర్ భూపాల్ మరియు మండల యూత్ కన్వీనర్ ఏరుకొండ రవితేజ, మరియు మండల కో-కన్వీనర్ల ఏరుకొండ అంజయ్య, కోరుపోలు అశోక్, ఖమ్మంపాటి సైదులు, బొడ్డుపల్లి మహేష్, ఆధ్వర్యంలో మునుగోడు మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన కుమ్మరి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం,యువత విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఏరుకొండ శ్రీనివాసులు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఖమ్మంపాటి సత్యనారాయణ,జిల్లా కో-కన్వీనర్ గంగాధర్ వెంకటేశ్వర్లు,రాజకీయ కన్వీనర్ చిలివేరు దుర్గయ్య హాజరయ్యారు.అలాగే జిల్లా కమిటీ సభ్యులు ఆమంచి వెంకటేశ్వర్లు, చిట్టిమల్లు ఆంజనేయులు, బత్తుల కృష్ణయ్య,సాగర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎలిజాల వెంకన్న,నకరికల్ నియోజకవర్గ అధ్యక్షులు నిమ్మనగోటివెంకన్న,పులిపల్పుల గ్రామ సర్పంచ్ ఖమ్మంపాటి జ్యోతి వెంకటేశ్వర్లుతో పాటు మండల గ్రామాల నుండి అధిక సంఖ్యలో కుమ్మరి కులస్తులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మునుగోడు మండలంలోని గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడుతూ త్వరలోనే మునుగోడు మండల పూర్తి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# కమిటీ ఓపెనింగ్ కి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 01:** మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీ రాజ రాజేశ్వరి కాలనీ ఫేస్.2 కమ్యూనిటి హాల్ ప్రారం భోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.ఈ సంద ర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులు తమ స్వంత నిధులతో ఇట్టి కమ్యూనిటి హాల్ నిర్మించు కోవడం జరిగింది అని అన్నారు.అలాగే మరో అదనపు అంతస్తు కోసం నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,శ్రీధర్ గౌడ్,కోసనం వెంకట్ రెడ్డి,జక్కిడి రఘువీర్ రెడ్డి,భాస్కర్ సాగర్,అనిల్ కుమార్ మరియు కాలనీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పై కక్ష సాధింపు చర్యలు మానేయాలి



**మునుగోడు :ఫిబ్రవరి- 01 (వార్త సంధ్య) :** మునుగోడు మండలలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) శ్రేణులు భారీగా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని మునుగోడు టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ,సిట్ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి,ప్రజా నాయకులను అక్రమ కేసులతో వేధించడం తగదని హెచ్చ రించారు .ప్రజల తరఫున పోరాడే నాయకులపై ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు,గ్రామ సర్పంచులు,మండల ముఖ్యనాయకులు,కార్యకర్తలు,అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.ప్రభుత్వ వైఖరి మారే వరకు పోరాటాలు కొనసాగుతాయని టీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# యూరియా సరఫరా ఇక యాప్ ద్వారానే.. రంగారెడ్డి జిల్లా రైతులకు కలెక్టర్ కీలక ఆదేశాలు

రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 1 (వార్త సంధ్య): రంగారెడ్డి జిల్లా రైతు సోదరులందరికీ జిల్లా యంత్రాంగం కీలక సూచనలు జారీ చేసింది. ఇకపై జిల్లాలో యూరియా సరఫరా పూర్తిగా యాప్ ఆధారిత ముందస్తు బుకింగ్ విధానం ద్వారానే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. యాప్ ద్వారా ముందుగా బుకింగ్ చేసుకున్న రైతులు మాత్రమే, తమకు వచ్చిన బుకింగ్ ఐడీని డీలర్ వద్ద చూపించి యూరియాను కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా యూరియా సరఫరాలో పారదర్శకత పెరగడంతో పాటు, అక్రమాలకూ చెక్ పడనుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా బుకింగ్ సులభతరం చేయడానికి డీలర్ల వారీగా, గ్రామాల వారీగా వాలంటీర్లను నియమించారు. దీంతో రైతులు క్యూ లలో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం లభించింది. యూరియా బుకింగ్, సరఫరాకు సంబంధించిన ఇతర వివరాల కోసం రైతులు తమ తమ మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవలసిందిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# సొంత డబ్బులతో నిర్మించుకున్న కమిటీ హాల్ ను ప్రారంభించిన - జి.హెచ్.ఎం.సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 01:** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని రాజరాజేశ్వరి కాలనీ ఫేస్ -2 లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మరియు కాలనీవాసులు తమ సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్న కాలనీ సంక్షేమ సంఘ భవనమును జి.హెచ్.ఎం.సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్తానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు... ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నేను గెలిచిన తర్వాత మొదటిగా రాజరాజేశ్వరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు చేసిన అనంతరం సి.సి రోడ్డుల నిర్మాణం కూడా చేయడం జరిగింది.

బొమ్మల గుడి ప్రాంతం నుండి డబుల్ బెడ్ రూమ్ వరకు 20 సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్డు పాడైపోవడంతో, గత నెల రోజుల క్రితం అధికారులతో కలిసి పర్వేక్షించి సుమారు రూ:-2.00 కోట్ల నిధులతో 23" ఫీట్ల రోడ్డును నిర్మించుకోబోతున్నామని శుభవార్తను తెలియజేశారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు ప్రతి ఒక్కరు తమ తోచినందుకు సహాయం చేసుకుని ఒక ప్రైవేట్ స్థలంలో నిర్మించిన ఇల్లును తీసుకొని

మీ సంక్షేమ సంఘ భవనం ఏర్పాటు చేసుకున్న మీ అందరూ ఏకమై ఒక తాటిపై ఉండి అనిత్యం ఇలానే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీ అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కే.మాధవరెడ్డి, కే.శ్రీనివాసరెడ్డి,కిరణ్ రెడ్డి, యాదగిరి,సామ మాధవరెడ్డి, జంగయ్య, మురళి,శ్రీకాంత్ రెడ్డి,లింగస్వామి,పద్మ, పుష్ప,అనిత,శ్రీలత,ఇంద్ర,లత మరియు కొండల్ రెడ్డి,శ్యాంసుందర్ రెడ్డి,నక్క రాజేష్ గౌడ్,ప్రమోద్ రెడ్డి, వెంకట్ రమణ గౌడ్,ప్రవీణ్ గౌడ్,సాయి రామ్ గౌడ్,రమేష్ చారి,జయ తేజ, బాలాజీ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంతీర్పు గైడ్‌లైన్స్ ప్రకారంగానే జర్నలిస్టులకు స్థలాలు

**ప్రభుత్వానికి విచక్షణాధికారం ఎలైట్ పీపుల్స్‌తో జర్నలిస్టులను పొల్చవద్దు**

**జర్నలిస్టులకు లీగల్ ఒపీనియన్ అనుకూలమని**

**అభిప్రాయపడిన హైకోర్టు మాజీ న్యాయమూర్తులు , న్యాయవాదులు**




**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (వార్త సంధ్య) :** జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ(జేఎన్‌జే) జర్నలిస్టులకు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారంగా ఇళ్ల స్థలాలు ఇచ్చే వెసులుబాటు ఉందని న్యాయకోవిదులు అభిప్రాయపడ్డారు. సుప్రీం తీర్పులోనే సంక్షేమ రంగాలకు పెద్దపీట వేయడానికి ప్రభుత్వానికి అధికారాలు ఉన్నాయని పేర్కొందన్నారు. ఆదివారం జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన "ఇళ్ల స్థలాలు- మార్గదర్శనం" అంశంపై న్యాయనిపుణులతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ బీఎస్ నారాయణ, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చే వెసులుబాటు ఇచ్చిందని, గత 18 ఏళ్లుగా డబ్బులు కట్టి ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సుప్రీం సూచనల మేరకు స్థలాలు ఇవ్వచ్చు: జస్టిస్ బీఎస్ నారాయణ జర్నలిస్టులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో దారులు మూయలేదని, అదే తీర్పులో ఇచ్చిన నిబంధనల మేరకు ఇచ్చే అవాకశం ఉందన్నారు. సుప్రీం తీర్పులో ప్యారా నెంబర్ 95లో పొందుపర్చిన అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. అలాగే బేసిక్ రేట్ కంటే అదనంగా మార్కెట్ రేటను కోడ్ చేసిన నేపథ్యంలో ఆ సూచనలు పరిగణలోకి తీసుకోవాల్సి ఇవ్వడానికి వెసులుబాటు ఉందన్నారు. తలదాచుకోవాడనికి గృహ నివాసం ఏర్పాటు చేసే అంశం ప్రజాస్వమ్య వ్యవస్థలో ప్రాథమిక అంశంగా చేర్చిన విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఎలైట్ పీపుల్స్ (ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు) మాదిరిగా జర్నలిస్టులను చూడకుండా వారి ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఎమ్మెల్యేలకు ఎంత వేతనాలున్నాయి..? వారిజీవన ప్రమాణాలు ఎలాఉన్నాయి..? రిటైర్‌మెంట్ తర్వాత వచ్చే ఫెన్షన్ ఎంత ఉంది..? అనేది జర్నలిస్టుల జీవన ప్రమాణాలపై బేరీజు వేయాలన్నారు. జర్నలిస్టుల దయనీయ పరిస్థితిని ప్రభుత్వాలు అర్థం చేసకుని వారికి సంక్షేమాన్ని అందివ్వడంలో న్యాయవ్యవస్థ తప్పుపట్టే అవకాశం లేదన్నారు. సుప్రీం మార్గదర్శకాలకు లోబడి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సీనియర్ న్యాయకోవిదులు తమతమ లీగల్ ఒపినీయన్ ఇచ్చారని అన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులైన సిద్దార్థ లూథ్రా, శేషాద్రినాయుడు, హైకోర్టు సీనియర్‌అడ్వకేట్లు వేదుల వెంకట రమణ, చిక్కడు ప్రభాకర్ ఇచ్చిన లీగల్ ఒపీనియన్ ప్రకారంగా జర్నలిస్టులకు గతంలో కేటాయించిన పేట్‌బషీరాబాద్, నిజాంపేట స్థలాలను ఇచ్చే వెసులుబాటు కల్పించిందన్నారు.

ఆర్థిక అసమానతలు పరిగణన లోకి తీసుకోవాలి :

జస్టిస్ చంద్రకుమార్ రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉన్నతోద్యోగులైన ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలతో పాటు జర్నలిస్టుల ఆర్థిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఫోర్త్ ఎస్టేట్‌లో పిల్లర్‌గా ఉన్న జర్నలిస్టులు ఆర్థికంగా మిగతి వారితో సమానంగాలేరు కాబట్టి వీరిని ఎలైట్‌గ్రూపులో కలుపడం భావ్యం కాదన్నారు. ఎలైట్ గ్రూపు జీవన ప్రమాణాలు చాలా రిచ్‌గా ఉంటాయి. కానీ, జర్నలిస్టుల జీవన ప్రమాణాలు దరిద్రంగా ఉంటాయని వివరించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు వారిని గుర్తించి, వారికి సంక్షేమం ఏర్పాటు చేయాల్సి బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాల ఆశచూపుతూ 18 ఏళ్లు గడిపింది. దాదాపు80 మంది మృత్యువాతపడినట్లు చెపుతున్నారు. ఇంకెతంత కాలం ఇళ్లులేని బతుకులని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సుప్రీంకోర్టుతీర్పును బూచీగా చూపాల్సిన అవసరం లేదన్నారు. సుప్రీం తీర్పులోని అంశాల ప్రకారంగానే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తీర్పులో వెలువరించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్థలాలు సాధించుకోవాలని జస్టిస్ చంద్రకుమార్ జర్నలిస్టులకు సూచించారు. అనంతరం హైకోర్టు సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రత్రా రంగంలో పనిచేసే జర్నలిస్టులకు ఒకే న్యాయం ఉండాలన్నారు. కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి మిగతా వారికి ఇవ్వకుండా చేయడమనేది మౌళిక సూత్రాలకు విరుద్ధమని అన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా సీనియర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తే వారు ఆ లబ్ధిని అనుభవిస్తున్నారు.. మరి జవహర్‌లాల్ సొసైటీ జర్నలిస్టులు ఎందుకు అనుభవించకూడదని ప్రశ్నించారు. అందరికీ ఒకే న్యాయం, ఒకే చట్టం వర్తింపజేయాలన్నారు. జవహర్‌లాల్ సైసైటీ జర్నలిస్టులకు ఇచ్చిన జీవోలోని మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఇళ్ల స్థలాలను ఆయా జర్నలిస్టులకు అందించింది. మరి హైదరాబాద్‌లో ఎందుకు ఇవ్వరని చిక్కుడు ప్రశ్నించారు. జర్నలిస్టులందరికీ ఒకే న్యాయం ఉండాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పులోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కొన్ని మార్గదర్శకాలు సూచించింది. ఆ ప్రకారంగానే ఇళ్ల స్థలాలు ప్రభుత్వానికి ఇచ్చే అధికారం ఉందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగానే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఏవిధంగా ఇవ్వవచ్చనే దానిపై సీనియర్ న్యాయవాదులు లీగల్ ఒపీనియన్లు అందించారని, వాటిని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించి ఉన్న స్థలాలను ఇచ్చే వెసులుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు సొసైటీ డైరెక్టర్లు పీవీ రమణారావు, కొండం అశోక్‌రెడ్డి లతో పాటు సీనియర్ జర్నలిస్టులైన సొసైటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కమ్యూనిటీ భవన్ ప్రారంభోత్సవం కి టి.పి.సి.సి చైర్మన్ మధు యాష్కి గౌడ్



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 01:** మన్సూరాబాద్ డివిజన్ రాజరాజేశ్వరి కాలనీ ఫేస్-2 కాలనీ అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ వారి కాలనీ లో పర్యటించి కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం టీ - నగర్ లోని ఎస్ వి హోమ్స్ అపార్ట్మెంట్ ను సందర్శించారు. లో ప్రెజర్ మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. జలమండలి జీఎం, మేనేజర్లతో మాట్లాడిన మధుయాష్కి వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. కాగా హయత్ నగర్ క్యాంప్ కార్యాలయంలో పలువురు కలిసి తమ సమస్యలు వివరించారు. హయత్ నగర్ పెద్ద మసీద్ కమిటీ ప్రతినిధులు కలిసి.. హెరిటేజ్ నిర్మాణం అయిన మసీదుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.వనస్థలిపురం ప్రశాంత్ నగర్ కాలనీ నూతన సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో పార్కుల నిర్వహణ, చెత్త సేకరణ సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులపై చారకొండలో బీఆర్ఎస్ నిరసన



**చారకొండ, ఫిబ్రవరి 01 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చారకొండ మండల కేంద్రంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో వ్యవహరిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎన్నికల సమయంలో వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా, ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని నిరసనకారులు మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి బాట వేసిన కేసీఆర్‌పై అక్రమంగా నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# వెలిగొండలో సొరంగాల పనులు - బ్లోయర్ల గాలే కార్మికులకు ఆక్సిజన్

**దాదాపు 18.89 కిలోమీటర్ల మేర సమాంతరంగా రెండు సొరంగాలు**

**ప్రతికూల పరిస్థితులను ఎదురీదుతూ విధుల నిర్వహణ**

**రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు పర్యటన**



ప్రకాశం జిల్లాకు ఆయువుపట్టైన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన సొరంగాల లైనింగ్ పనులను కార్మికులు, ఇంజినీర్లు ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి చేస్తున్నారు. నల్లమల గర్భంలో జరుగుతున్న పని ప్రదేశాల్లో ఆక్సిజన్ అందడం కూడా కష్టంగా ఉంటుంది. సొరంగాల్లో ఏర్పాటు చేసిన బ్లోయర్లు అందించే గాలిని మాత్రమే పీల్చుకుంటూ పనులు చేపడుతున్నారు.

**18.89 కిలోమీటర్ల మేర :** నల్లమల సాగర్‌కు ప్రాజెక్టు పరిధిలోని కృష్ణా జలాలను అందించేందుకు దాదాపు 18.89 కిలోమీటర్ల మేర సమాంతరంగా రెండు సొరంగాలు తవ్వారు. దోర్నాల మండలం కొత్తూరు నుంచి కృష్ణానదిలోని కొల్లంవాగు వరకు నల్లమల గర్భంలో తొలి సొరంగం 7 మీటర్లు ఉండగా, రెండో సొరంగం 9.2 మీటర్ల వ్యాసంతో తవ్వారు. తొలి సొరంగాన్ని సుమారు 17.8 కిలో మీటర్ల మేర టన్నెల్ బోరింగ్ యంత్రంతో తవ్వి లైనింగ్ పనులు చేపట్టగా, కిలోమీటరు మేర మాన్యువల్‌గా చేపట్టారు. టన్నెల్ బోరింగ్ యంత్రంతో రెండో సొరంగాన్ని 11.7 కిలోమీటర్ల మేర చేపట్టి, మిగిలిన 7.19 కిలోమీటర్లను మాన్యువల్‌గానే చేస్తున్నారు.

రోజుకు 16 నుంచి 20 మీటర్ల చొప్పున లైనింగ్ పనులు : ఇప్పటి వరకు 4.4 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పూర్తికాగా, మరో 2.8 కిలో మీటర్ల మేర పనులు జరగాల్సి ఉంది. ఒక్కొక్క షిఫ్టులో దాదాపు 150 మంది చొప్పున రెండు షిఫ్టుల్లో సుమారు 300 మంది కార్మికులు, ఇంజినీర్లు పనులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ సంవత్సరంలో జూన్ చివరి నాటికి లైనింగ్ పనులు పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించిన నేపథ్యంలో రోజుకు 20 మీటర్ల చొప్పున లైనింగ్ పనులను చేయాల్సి ఉంది. ప్రస్తుతం 16 నుంచి 20 మీటర్ల లోపు మాత్రమే పని జరుగుతోంది.

**గాలి అందిస్తున్న బ్లోయర్లు :** టన్నెల్ బోరింగ్ యంత్రం రెండో సొరంగంలో 11.7 కిలోమీటరు వద్ద ఉంది. అది సొరంగాన్ని కప్పి ఉంచడంతో మరోవైపుకు గాలి కూడా దూరని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ ప్రదేశంలో పనిచేసే కార్మికులు, ఇంజినీర్లకు గాలిని అందించేందుకు బ్లోయర్లను ఏర్పాటు చేశారు. తొలి సొరంగం ప్రారంభం, చివరలో రెండు పెద్ద బ్లోయర్లు బిగించారు. వీటి ద్వారా ఒక్కొక్క దాని నుంచి సెకనుకు దాదాపు 350 క్యూబిక్ మీటర్ల గాలి వస్తోంది. తొలి సొరంగం నుంచి రెండో సొరంగంలోకి ఏర్పాటు చేసిన ఆరు అడ్డ దారుల్లోకి కూడా వెళుతుంది.

**సెకనుకు 200 నుంచి 250 క్యూబిక్ మీటర్ల గాలి :** పని ప్రదేశాల్లో 8 బ్లోయర్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క దాని నుంచి సెకనుకు సుమారు 200 నుంచి 250 క్యూబిక్ మీటర్ల గాలి వస్తోంది. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు ఆ గాలి సరిపోక కార్మికు లు, ఇంజినీర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల పడుతున్న కష్టాన్ని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెండో సొరంగంలో పని ప్రదేశానికి వెళ్లి కళ్లారా చూశారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇవ్వాలని అక్కడ పని చేసేవారు మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి రామానాయుడు వారి అభ్యర్థనను ప్రభుత్వానికి నివేదించారు.

# కోనసీమలో ఓఎన్‌జీసీ సైట్ వద్ద గ్యాస్ లీక్

**అదుపు చేసిన టెక్నికల్ సిబ్బంది**

**మలికిపురం మండలం కేశనపల్లి వద్ద ఓఎన్జీసీ సైట్ నుంచి గ్యాస్ లీక్**

**డ్రిల్ సైట్ వద్ద సుమారు గంటసేపు లీక్ అయిన గ్యాస్**

**మరో డ్రిల్ నుంచి వచ్చి అదుపుచేసిన సిబ్బంది**



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లి వద్ద ఓఎన్‌జీసీ సైట్ నుంచి గ్యాస్ లీక్ అయ్యింది. డ్రిల్ సైట్ వద్ద సుమారు గంట సేపు గ్యాస్ లీక్ కాగా సిబ్బంది అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. సమీపంలోనే మరో డ్రిల్ సైట్ వద్ద ఉన్న టెక్నికల్ సిబ్బంది అక్కడకు చేరుకుని గ్యాస్ పైప్ లైన్ లీకును అరికట్టారు.దీంతో పెను ప్రమాదం తప్పిందని ఓఎన్‌జీసీ అధికారులు చెబుతున్నారు. ఇదే మండలం ఇరుసుమండ వద్ద డ్రిల్ సైట్ నుంచి బ్లో అవుట్ అయ్యి 5 రోజుల పాటు మంటలు ఎగసిపడటంతో ప్రజలు ఆందోళన గురయ్యారు. ఆ ఘటన మరువక ముందే మరోసారి ఇలాంటి వార్త వినటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిస్థితిని సిబ్బంది అదుపులోకి తేవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ఓఎన్‌జీసీ నిర్లక్ష్యం వల్ల తరచూ గ్యాస్ లీక్ ఘటనలు జరుగుతున్నాయని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవట్లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా జనవరి 5న కోనసీమ జిల్లా మలికిపురం మండలంలోని ఇరుసుమండ గ్రామంలో ఓఎన్‌జీసీ సైట్ వద్ద గ్యాక్ లీక్ అయ్యి బ్లో అవుట్ జరిగి మంటలు ఎగసిపడ్డాయి. దాదాపు 5 రోజులు వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఎట్టకేలకు పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ఓఎన్‌జీసీ నిపుణుల బృందం తీవ్రంగా శ్రమించింది. ఓఎన్‌జీసీ టెక్నాలజీస్ ఫీల్డ్ సర్వీసెస్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా, ఓఎన్‌జీసీ, ఎంసీఎంటీ బృంద హెడ్ శ్రీహరి నేతృత్వంలో రిస్క్ ఆపరేషన్ చేశారు. గూడపల్లి పంట కాల్వ నుంచి నీటిని వినియోగించుకొని అగ్నికీలలను చల్లబరిచారు.

**దేశీయ పరిజ్ఞానంతోనే మంటల అదుపు :** 5 వేల జీపీఎం సామర్థ్యం గల పంపుతో నీటిని భారీ పైపులతో మంటల పైకి పంపారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అమెరికాకు చెందిన ప్రత్యేక టెక్నాలజీ బృందాన్ని తీసుకు వచ్చారు. కానీ పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పింది.బ్లో అవుట్ మంటలకు దగ్ధమైన భారీ యంత్రాల శకలాలను ఓఎన్జీసీ సిబ్బంది తొలగించింది. ఈ ఘటనలో సుమారు 300 మెట్రిక్ టన్నుల బరువు గల శకలాలను ఆ ప్రదేశం నుంచి భారీ క్రేనుల సహాయంతో బయటకు తీశారు. మరో 300 నుంచి 400 టన్నుల బరువు గల శకలాలు కూడా పూర్తిగా తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బ్లో అవుట్ వల్ల సుమారు 3 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ దగ్ధమైనట్టు అంచనా వేస్తున్నారు.మరోవైపు బ్లోఅవుట్ ప్రాంతానికి వెళ్లేందుకు ఇప్పటికే అధికారులు అత్యవసర రహదారిని ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రూ.8 లక్షలతో రహదారి ఏర్పాటు చేశారు. అలాగే బ్లోఅవుట్ ప్రాంతంలో కిలోమీటర్ పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఇంటింటా సర్వే చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను అధికారులు నియమించారు. అదే విధంగా పంట నష్టం వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే కాలుష్య నియంత్రణ శాఖ నీరు, గాలి కాలుష్యం వివరాలను పరిశీలించారు.

# 2 నామినేషన్లతో అభ్యర్థుల ముందు జాగ్రత్త

**ఏ పార్టీ బీ-ఫారం ఇస్తే ఆ పార్టీ తరపున బరిలోకి**

**రాష్ట్రంలో ముగిసిన నామినేషన్ ప్రక్రియ**

**అధికారికంగా ఆయా పార్టీల తరపున అభ్యర్థులెవరనేది ముందుగా తేల్చకపోవడంతో గందరగోళం**



ఏ పార్టీ బీ-ఫారమ్ ఇస్తే అటు వైపునకు వెళ్లనున్న అభ్యర్థులు

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లోని తొలి అడుగు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,996 డివిజన్లు వార్డుల్లో ఎన్నికలు జరుగుతుండగా దాదాపు 28 వేల మందికి పైగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అధికారికంగా ఆయా పార్టీల తరఫున అభ్యర్థులెవరనేది ముందుగా తేల్చకపోవడంతో ఇబ్బడిముబ్బడిగా నామినేషన్లు పడ్డాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లలో చాలాచోట్ల ఒక్కో స్థానానికి ఒక్కో పార్టీ తరఫున ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. సర్వేల ఆధారంగా ఆయా పార్టీలు టికెట్ ఇవ్వాలని భావించడం స్పష్టంగా ఎవరిని నిలబెట్టేది తేల్చకపోవడంతో అభ్యర్థులు ముందు జాగ్రత్త పడ్డారు. నమ్ముకున్న పార్టీ బీ-ఫారమ్ ఇవ్వకపోతే మరో పార్టీ తరఫున బరిలో నిలవడానికి మొగ్గు చూపుతున్నారు.

**ఏ పార్టీ బీ-ఫారమ్ ఇస్తే ఆ పార్టీలోకి :** కరీంనగర్ కార్పొరేషన్‌లోని 57వ డివిజన్‌లో ఓ మహిళా అభ్యర్థి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ ఇలా నాలుగు పార్టీల తరఫున నామినేషన్ దాఖలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కార్పొరేటర్‌గా పోటీ చేయాలని భావించిన ఆమె ఏ పార్టీ బీ-ఫారమ్ ఇస్తే ఆ పార్టీ నుంచి పోటీకి సై అంటున్నారు. ఇలా ఈ నగరంలో మరో నలుగురు అభ్యర్థులు కూడా రెండు పార్టీల తరఫున నామినేషన్లు వేశారు. ఏ పార్టీ అండగా నిలిస్తే ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమనే సంకేతాలిస్తున్నారు.

**ఒకే వ్యక్తి రెండు పార్టీల పేరుతో :** కామారెడ్డి జిల్లా బాన్సువాడలోనూ ఐదుగురు అభ్యర్థులు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులమని వేర్వేరు సెట్లు దాఖలు చేశారు. ఇక్కడ ఆయా పార్టీల్లో ఉన్న వర్గ పోరు దృష్ట్యా టికెట్ తమకు వస్తుందో రాదోననే సందిగ్ధంతో ఈ వ్యూహంతో సాగుతున్నారు. మొదట కాంగ్రెస్ తరఫున నామినేషన్లను సమర్పించినవారే చివరి రోజున ఎందుకైనా మంచిదనే ఆలోచనతో బీఆర్ఎస్ అభ్యర్థులుగా కూడా వేశారు. బీ-ఫారం సమర్పణకు 3వ తేదీ వరకు సమయం ఉండటంతో ఇలా వ్యూహాత్మక ధోరణిని అవలంబిస్తున్నారు.

**పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పురపాలికలోనూ ఇద్దరు అభ్యర్థులు ఆయా పార్టీల నుంచి టికెట్ ఆశించారు. అక్కడ బలమైన అభ్యర్థులు లేకపోవడంతో తమకున్న పలుకుబడి ఆధారంగా టికెట్ ఇస్తారనే ఉద్దేశంతో రెండు పార్టీలతో టచ్‌లో ఉంటున్నారు. నామినేషన్ దాఖలు సమయానికి కూడా అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో ఒకే అభ్యర్థి రెండు పార్టీల తరఫున పోటీ చేస్తున్నట్లు వేర్వేరు నామినేషన్లను ఎన్నికల అధికారికి అందించారు. ఉమ్మడి మెదక్, నల్గొండ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌తోపాటు గద్వాల బల్దియాలో కొందరు ఒక పార్టీ తరఫున, అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.

**రిజర్వేషన్ విధానంతో పదవి :** ఎన్నికల్లో నేరుగా పోటీ చేసి గెలవకపోయినా, రిజర్వేషన్ విధానం ప్రకారం ఛైర్మన్ పదవులు దక్కించుకోవచ్చన్న లెక్కలతో చాలామంది వ్యాపారులు ముందడుగు వేస్తున్నారు. వార్డుల ఫలితాల ఆధారంగా బలమైన కౌన్సిలర్ల మద్దతు సాధిస్తే, తర్వాత ఛైర్మన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించవచ్చన్నది వారి వ్యూహం. అందుకే ఇప్పటి నుంచే అన్ని విధాలా సిద్ధమవుతూ రాజకీయ సమీకరణాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ఉపసంహరణకు గడువుండటంతో ఇలా :** మూడు వంతుల మేర ఏకాభిప్రాయంతో నామినేషన్లు దాఖలు కాగా, మరో పావు వంతు స్థానాల్లో ఒకరికంటే ఎక్కువ ఆశావహులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల టికెట్లు ఆశిస్తున్న వారందరినీ నామినేషన్లు వేయమని ఇంఛార్జ్‌లే సూచించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణకు గడువుండటంతో ఒకటికి మించి నామినేషన్లు వేసిన స్థానాల్లో నేతలను సమన్వయం చేయనున్నారు. అందరి మధ్య ఏకాభిప్రాయం తెచ్చి ఒక్కరే బరిలో ఉండేలా స్క్రీనింగ్ కమిటీలు కృషి చేస్తాయని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

# సిగరెట్లు, పాన్ మసాలా ప్రియం: నేటి నుంచే కొత్త పన్నులు

**సిగరెట్ పొడవును బట్టి అదనపు ఎక్సైజ్ డ్యూటీ**

**పాన్ మసాలాపై కొత్తగా 'హెల్త్ అండ్ నేషనల్ సెక్యూరిటీ సెస్'**

**ఈ-సిగరెట్లు, నికోటిన్ ఉత్పత్తులపై 100 శాతం పన్ను**

**అక్రమ రవాణా పెరుగుతుందనే ఆందోళనలో నిపుణులు**



దేశంలో 'సిన్ గూడ్స్'గా పిలిచే పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం కొత్త పన్నుల నియమావళిని అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు ఉన్న 28 శాతం జీఎస్టీ ప్లస్ కాంపెన్సేషన్ సెస్ స్థానంలో.. ఇప్పుడు 40 శాతం జీఎస్టీతో పాటు అదనపు ఎక్సైజ్ డ్యూటీ, హెల్త్ సెస్ విధిస్తున్నారు. దీనివల్ల సిగరెట్ల ధరలు 15 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.సిగరెట్ పొడవు, ఫిల్టర్ రకాన్ని బట్టి పన్నులను ఖరారు చేశారు, 65 మి.మీ లోపు (నాన్-ఫిల్టర్) ఒక్కో సిగరెట్‌పై రూ. 2.05 అదనపు డ్యూటీ, 65 మి.మీ లోపు (ఫిల్టర్) ఒక్కో సిగరెట్‌పై రూ. 2.10 అదనపు డ్యూటీ, మీడియం (65-70 మి.మీ) ఒక్కో స్టిక్‌పై సుమారు రూ. 4 వరకు పెంచారు. అలాగే, ప్రీమియం/లాంగ్ (70-75 మి.మీ) ఒక్కో స్టిక్‌పై రూ. 5.40 వరకు భారం పడనుంది. కొన్ని కేటగిరీల్లో 1000 సిగరెట్లపై రూ. 8,500 నుంచి రూ. 11,000 వరకు ఎక్సైజ్ డ్యూటీ పడనుంది.పాన్ మసాలా, గుట్కా తయారీదారులు ఇకపై తమ ప్యాకింగ్ మెషీన్ల సామర్థ్యం ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, తయారీ కేంద్రాల్లో తప్పనిసరిగా జజుం కెమెరాలు, ఏర్పాటు చేసి ఆ ఫుటేజీని 24 నెలల పాటు భద్రపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. పచ్చి పొగాకుపై 60-70 శాతం, ఈ-సిగరెట్లపై 100 శాతం పన్ను విధించడం ద్వారా ప్రభుత్వం తన కఠిన వైఖరిని స్పష్టం చేసింది.ధరలు పెంచడం ద్వారా ప్రజలు ధూమపానానికి దూరమవుతారని ప్రభుత్వం భావిస్తుండగా, నిపుణులు మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పన్నులు మరీ ఎక్కువగా ఉంటే, ప్రజలు చౌకగా దొరికే స్మగ్లింగ్ సిగరెట్లు లేదా నకిలీ ఉత్పత్తుల వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, ప్రజల ఆరోగ్యం మరింత దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఇక నో టెన్షన్

**మీ స్మార్ట్‌ఫోన్‌లోనే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు**

**కళాశాలకు వెళ్లకుండానే మొబైల్‌ఫోన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం**

**లక్షలాదిమంది విద్యార్థులకు చేకూరనున్న ప్రయోజనం**



రాష్ట్రంలోని పది, ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్. కళాశాల ఫీజు బకాయిలు చెల్లించే వరకు హాల్‌టికెట్లు ఇచ్చేది లేదని ప్రిన్సిపాళ్ల బెదిరింపులు ఇకపై సాగవు. టెన్త్, ఇంటర్ విద్యార్థులు స్కూళ్లు, కళాశాలకు వెళ్లకుండానే తమ మొబైల్‌ఫోన్లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం, ఓపెన్ స్కూల్ సొసైటీ ఇప్పటికే కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాయి. మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నటువంటి పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను విద్యార్థులు తమ స్మార్ట్‌ఫోన్ల నుంచి పొందొచ్చు. ఈ నెల 25వ తేదీ నుంచి మొదలయ్యే ఇంటర్ వార్షిక పరీక్షలకు ఈ కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఇంటర్‌బోర్డు సాంకేతిక విభాగం మీసేవ అధికారులతో చర్చిస్తోంది.

**లక్షల మందికి ప్రయోజనం :** ప్రస్తుతం ఆయా బోర్డులు(ఎస్ఎస్‌సీ, ఇంటర్) హాల్‌టికెట్లను తొలుత విద్యాసంస్థలకు పంపిస్తాయి. గత కొన్ని సంవత్సరాలుగా పరీక్షలకు కొద్ది రోజుల ముందు వెబ్‌సైట్లో కూడా పెడుతున్నాయి. కొంతమంది హాల్‌టికెట్లు తీసుకుంటారు. ఫీజు బకాయిలు ఉన్నవిద్యార్థులు వాటిని పొందలేకపోతున్నారు. దీంతో పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో తెలియక వారు సతమతమవుతుంటారు. ఫీజు మొత్తం చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని విద్యార్థులను చాలావరకు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు బెదిరిస్తుంటారు. అసలే పరీక్షల టెన్షన్ మరో వైపు హాల్‌టికెట్లు ఇవ్వరేమో, పరీక్షలు రాయలేకపోతానేమోనని విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతుంటారు. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టేందుకే ఎస్ఎస్‌సీ బోర్డు, టాస్, ఇంటర్మీడియట్ ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాయి.

**పదో తరగతి విద్యార్థులు :** సుమారు 5.30 లక్షల మంది(వారిలో 3 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు)

**టాస్‌లో పది, ఇంటర్ విద్యార్థులు :** దాదాపు లక్ష మంది. వీరికి నామమాత్రపు రుసుము మాత్రమే ఉన్నందున హాల్‌టికెట్ల సమస్య లేదు.

**ఇంటర్ విద్యార్థులు :** 10 లక్షల మంది(6.40 లక్షల మంది ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న వారే)

డౌన్‌లోడ్ చేసుకోండిలా : స్మార్ట్‌ఫోన్ల నుంచి హాల్‌టికెట్లు పొందేలా ఐటీశాఖ పరిధిలోని మీసేవ విభాగం అధికారులు సేవలందిస్తున్నారు. ఎస్ఎస్‌సీ, టాస్, ఇంటర్మీడియట్ బోర్డులు విద్యార్థుల వివరాలను మీసేవ విభాగానికి అందిస్తాయి. పరీక్షలకు ముందు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ కోసం మీసేవ విభాగం అధికారికంగా ఒక మొబైల్ నంబరును ఇస్తుంది. దానికి విద్యార్థులు హాయ్ అని మెసేజ్ చేయాలి. అప్పుడు విద్యార్థుల మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. దాన్ని ఓపెన్ చేసి విద్యార్థి పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలను ఎంటర్ చేయాలి. అనంతరం హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది.

**ఫిబ్రవరి 25వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం :** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 25న మొదటి సంవత్సరం, 26వ తేదీన సెకండియర్ పరీక్షలు మొదలుకానున్నాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల టైం టేబుల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు గతంలో విడుదల చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రతి రోజూ 2 షిఫ్టుల్లో నిర్వహిస్తారు.ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్స్ (20 మార్కులకు) ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 21న, సెకండియర్‌కు 22వ తేదీన జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 24వ తేదీన పర్యావరణ విద్య ఎగ్జామ్‌ను నిర్వహిస్తామని అధికారులు గతంలో వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ కలిపి సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

# మొత్తం బడ్జెట్ ఎంత.. ఏ రంగానికి ఎంతెంత..?




ఐంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు**

2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025-26 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు.

**మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులు**

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున దంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**రంగాల వారీగా నిధుల కేటాయింపు**

ఈ బడ్జెట్‌లో పలు కీలక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.బయోఫార్మా: బయోఫార్మా రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించారు. దీనికోసం రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించారు. ఎంఎస్ఎంఈ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**ఎలక్ట్రానిక్స్:** ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం కోసం కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు.

**పరిశ్రమలు:** కంటైనర్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి రూ.10,000 కోట్లు కేటాయించారు.

**పర్యావరణం:** కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీల కోసం రాబోయే ఐదేళ్లలో రూ.20,000 కోట్లు కేటాయించారు.

**పట్టణాభివృద్ధి:** నగర ఆర్థిక ప్రాంతాల (సిటీ ఎకనామిక్ రీజియన్స్) అభివృద్ధి కోసం ఒక్కో ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్లు కేటాయించనున్నారు.

**పన్నులు, ఇతర ప్రతిపాదనలు**

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

## క్రెడిట్ కార్డులు వరమా..? శాపమా..?



అప్పుల ఊబిని తప్పించే మార్గాలేవి!దుర్వినియోగం చేస్తే క్రెడిట్ కార్డులు అప్పుల ఊబిలోకి లాగేస్తాయి. కానీ క్రమశిక్షణతో వాడుతూ.. పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిపి, ఖర్చులను అదుపులో పెడితే మీ రుణపరపతిని అమాంతం పెంచేస్తాయి. అధిక వడ్డీరేట్లు, ఆర్థిక ఒత్తిళ్లనూ అధిగమించవచ్చు. ఇంతకీ క్రెడిట్ కార్డులు.. వినియోగదారులపట్ల వరమా..? శాపమా..? రుణాల ఉచ్చు నుంచి తప్పించుకోవడానికున్న మార్గాలేవి?

దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం పెద్ద ఎత్తున పెరిగిపోయింది. గత కొన్నేండ్లలో క్రెడిట్ కార్డు యూజర్ల సంఖ్య జెట్ స్పీడ్‌తో పెరిగిపోయిందంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. మార్కెట్‌లో సులభంగానే క్రెడిట్ కార్డులు లభిస్తుండటం, ఆకర్షణీయ ఆఫర్లు, పెరిగిన వినిమయ శక్తి.. ఇవన్నీ కూడా ఇందుకు కారణమే. అయితే మితిమీరుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం.. కార్డుదారులు, గృహస్తులను అప్పుల ఊబిలోకి లాగుతున్నదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయిప్పుడు. కానీ రుణ సాధనాలను వాడుతున్నప్పుడు క్రెడిట్ కార్డు వినియోగదారులు ఎలా ఉంటున్నారు? మరెలా ఆలోచిస్తున్నారు? అన్నది ఇక్కడ ప్రశ్న. మరి దీనిపై ఆర్థిక నిపుణులు ఏమంటున్నారు?

**ఇదీ సంగతి..**

అధిక వడ్డీరేట్లు క్రెడిట్ కార్డు వినియోగదారులను అప్పుల ఊబిలో పడేస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం వాడకంలో ఉన్న చాలా క్రెడిట్ కార్డులపై యూజర్లు గడువులోగా బకాయిలను చెల్లించకపోతే గరిష్ఠంగా 30 నుంచి 42 శాతం చార్జీలు పడుతున్నాయి. చిన్నచిన్న బకాయిలపైనా వడ్డీ భారం తడిసి మోపెడవుతున్నది. ఇక ఎడాపెడా ఖర్చులు చేసి, ఆపై మొత్తం బకాయిలను చెల్లించకుండా చాలామంది మినిమం పేమెంట్స్‌తోనే సరిపెడుతున్నారిప్పుడు. దీనివల్ల కార్డును అప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంచుకుంటున్నా.. దీర్ఘకాలంలో మాత్రం యూజర్లు అప్పుల ఊబిలో పడే ప్రమాదం ఏర్పడుతున్నది. 'ఇప్పుడు వాడుకోండి.. ఆ తర్వాత చెల్లించండి', 'సులభ వాయిదాల్లో పేమెంట్స్ చేయండి'.. ఇలా రకరకాల ఆఫర్లు క్రెడిట్ కార్డు యూజర్లను అవసరం లేకపోయినా ఖర్చులకు ప్రేరేపిస్తున్నాయి. ఫలితంగా చివరకు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నవారెందరో.

**ఇవే సమస్యలు**

క్రెడిట్ కార్డు వినియోగదారుల్లో చాలామందికి ఆర్థిక క్రమశిక్షణ అంతంతమాత్రంగానే ఉంటున్నది. బకాయిలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయకుండా.. తదుపరి నెలల్లోకి తీసుకెళ్లడం వారిపై రుణ భారాన్ని పెంచేస్తున్నది.

నిజానికి క్రెడిట్ కార్డు రుణ నిర్వహణ అనేది చాలా కీలకం. ప్రభావవంతంగా, వివేకంతో వినియోగిస్తేనే లాభదాయకం.

బ్యాంకులు ఇస్తున్నాయి కదా.. అని చాలామంది అనేక కార్డులను తీసుకుంటున్నారు. దీనివల్ల రీపేమెంట్లు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి.

క్రెడిట్ కార్డులతో ఏటీఎంల్లో నగదు ఉపసంహరణలు చేస్తున్నారు. అయితే ఈ లావాదేవీలకు అధిక ఫీజులుంటాయి. మొదటి రోజు నుంచే చార్జీలు వర్తిస్తాయి. తెలియకుండానే భారం పడుతుంది.

క్రెడిట్ కార్డులను అజాగ్రత్తగా వాడితే అప్పుల కుప్పే. క్రమశిక్షణతో వినియోగిస్తేనే సత్ఫలితాలుంటాయి. అందుకే క్రెడిట్ కార్డును ఓ స్వల్పకాలిక రుణంగా భావించాలి. కొనుగోళ్లు, ఖర్చులపై అవగాహన ఉండాలి. బకాయిలను పూర్తిగా చెల్లిస్తే రుణ పరపతి పెరుగుతుంది. ఇస్తున్నారుకదా అని ప్రతీ కార్డునూ తీసుకోవద్దు. రెండుకు మించి క్రెడిట్ కార్డులుంటే రుణ భారమే. కార్డుకున్న రుణ పరిమితిని పూర్తిగా వాడుకోవద్దు. 70 శాతం మించి వాడకపోవడమే మంచిది.- కుందన్ షాహి, జవో వ్యవస్థాపకుడు

**ఇలా చేయండి..**

క్రెడిట్ కార్డు బకాయిలను క్లియర్ చేయడానికి నెలవారీ రీ-పేమెంట్ రూల్‌ను పెట్టుకోండి. మినిమం బ్యాలెన్స్‌లు కాకుండా పూర్తిస్థాయిలో బకాయిలను చెల్లించండి. క్రెడిట్ లిమిట్‌ను మీ ఖర్చులకున్న పరిమితిగా భావిస్తే అనవసరపు వ్యయాలను దూరం పెట్టవచ్చు. ఖర్చులను తెలుసుకోవడానికి డిజిటల్ యాప్‌లు, స్టేట్‌మెంట్లను వాడండి. రివార్డులను రిడీమ్ చేసుకోండి. కానీ వాటిని వాడుకోవద్దు.

## మీ చిన్నారులకు పాన్ కార్డ్ తీసుకోండి.. ఇన్వెస్ట్‌మెంట్‌పై అవగాహన కల్పించండి!




ఏదైనాసరే చిన్నప్పటినుంచీ చేస్తే అది ఒక హాబీగా, ఆ రంగంలో నిష్ణాతులుగా మారే అవకాశం చాలా ఎక్కువ. అది సాంస్కృతిక అంశాలైనా, క్రీడలైనా లేదా పొదుపు, పెట్టుబడులైనా. ఆయా అంశాల్ని చిన్నారులకు అలవాటు చేయడం కూడా తల్లిదండ్రుల బాధ్యత.

ఇంటర్నెట్ డెస్క్: ఇప్పుడు, మైనర్లు (18 సంవత్సరాల వయసు లోపు వారు) కూడా పాన్ కార్డ్ తీసుకోవచ్చని మీకు తెలుసా. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ఇటీవల చిన్నారులకు(మైనర్లు) పాన్ కార్డ్ ఆవశ్యకతపై ఓ ప్రత్యేక ఈ-క్యాంపెయిన్ కూడా చేపట్టింది. చిన్నారుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు వారి ప్రతినిధులుగా పాన్ కార్డు కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దేశంలో నివసించే వారితో పాటు నాన్ రెసిడెంట్ ఇండియన్స్ పాన్ కార్డ్ తీసుకోవచ్చు. ఇందుకోసం ఆన్‌లైన్ లో అప్లై చేసి పొందవచ్చు. అయితే, మైనర్లు స్వయంగా పాన్ కార్డ్ కోసం దరఖాస్తు చేయడం వీలుకాదు. వారి తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు లేదా రిప్రెజెంటేటివ్ అసెస్సీలు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా అప్లై చేయొచ్చు. పిల్లలు భారత్‌లో నివసిస్తున్నా, ఎన్ఆర్ఐ అయినా పాన్ కార్డ్ కోసం దరఖాస్తు చేయవచ్చు.

ఇందుకోసం ఆన్‌లైన్ విధానంలో సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫామ్ నింపాలి. అవసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. ఆ ఫామ్స్ ఆఫ్‌లైన్ విధానంలో PAN కేంద్రానికి పంపించాలి. మైనర్‌కు జారీ చేసిన పాన్ కార్డ్‌లో వారి ఫోటో, సంతకం ఉండదు. 18 ఏళ్ల వయసు నిండిన తర్వాత, ఫోటో, సంతకంతో కొత్త కార్డ్ కోసం అప్లై చేయాల్సి ఉంటుంది. అయితే, పాన్ నంబర్ మాత్రం పాతదే కొనసాగుతుంది.

### పెట్టుబడుల మీద చిన్నారులకు అవగాహన:

నేటి పోటీ ప్రపంచంలో చిన్నారులకు చిన్నతనం నుంచే పొదుపు, పెట్టుబడుల ఆవశ్యకత పట్ల వారిని నేరుగా ఇన్వాల్వ్ చేసే వీలుంటుంది. చిన్నారులకు వారి పేరుపై పాన్ కార్డ్ ఉంటే, డీమ్యాట్ అకౌంట్ ఓపెన్ చేసి, షేర్లు కొనుగోలు చేయవచ్చు. కానీ ఇది పూర్తిగా తల్లిదండ్రులు లేదా చట్టపరమైన గార్డియన్ (లీగల్ గార్డియన్) పర్యవేక్షణలోనే జరుగుతుంది. మైనర్‌లు ట్రేడింగ్ లేదా సెల్(అమ్మకాలు) చేయలేరు. ఎందుకంటే ఇండియన్ కాంట్రాక్ట్స్ యాక్ట్, 1872 ప్రకారం వారు ఆర్థిక ఒప్పందాల్లో పాల్గొనలేరు. అయితే, కంపెనీస్ యాక్ట్, 2013 ప్రకారం ఏ వయస్సు ఉన్నా షేర్లు కలిగి ఉండవచ్చు. ఇంట్రాడే, F&O, కరెన్సీ డెరివేటివ్స్ వంటివి మాత్రం చేయకూడదు. అయితే, మైనర్స్ అకౌంట్‌ను గార్డియన్ మాత్రమే ఆపరేట్ చేయాలి. షేర్లు గిఫ్ట్ రూపంలో మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. 18 సంవత్సరాల తర్వాత మైనర్.. మేజర్ అయినప్పుడు, అకౌంట్ కొనసాగించవచ్చు కానీ కొత్త కేవైసీ , అప్లికేషన్ సబ్మిట్ చేయాలి.

### చిన్నారులకు పాన్ కార్డు వల్ల ఇతర లాభాలు:

చిన్నారుల పేర బ్యాంక్‌లో ఖాతా తెరవడానికి సులభమవుతుంది. పిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ , రికరింగ్ డిపాజిట్ లాంటి ఖాతాలు తెరవడానికి పాన్ కార్డు చాలా ఉపయోగపడుతుంది. చిన్నారుల పేర మ్యూచువల్ ఫండ్స్, SIPలలో పెట్టుబడులకు వీలు కలుగుతుంది. అంతేకాదు, ఫైనాన్షియల్ ఐడెంటిటీ చిన్న వయసులోనే చిన్నారులకు బిల్డ్ అవుతుంది.

## రిస్క్ లేకుండా మంచి రాబడి కావాలా..

**డెట్ ఫండ్స్ బెస్ట్ ఆప్షన్- కానీ ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!**

**డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలా ఈ విషయాలు కచ్చితంగా తెలుసుకోండి!**



స్టాక్ మార్కెట్‌లో ఒడుదొడుకులు సహజం. అందువల్ల స్వల్పకాలంలో నష్టభయం ఎక్కువగా ఉంటుంది. అందుకే చాలా మంది డెట్ పథకాలవైపు మొగ్గు చూపుతారు. అయితే డెట్ ఫండ్స్‌లో కూడా రిస్క్ ఉంటుంది. కనుక డెట్ పథకాలు పూర్తిగా సురక్షితం అనే అపోహలు వీడడం మంచిది. అందుకే డెట్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే ముందు కొన్ని కీలక విషయాలు కచ్చితంగా తెలుసుకోవాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.డెట్ ఫండ్స్ ప్రధానంగా గవర్నమెంట్ బాండ్లు, ట్రెజరీ బిల్లులు, కార్పొరేట్ బాండ్లు మొదలైన పథకాల్లో మదుపు చేస్తాయి. సాధారణ ఈక్విటీ పథకాలతో పోలిస్తే, వీటి పెట్టుబడి వ్యూహం కాస్త భిన్నంగా ఉంటుంది. కొన్ని ఫండ్లు మూడేళ్ల పరిమితి ఉన్న బాండ్లలో ఇన్వెస్ట్? చేస్తాయి. మరికొన్ని స్వల్పకాలిక పథకాల్లో మదుపు చేస్తాయి. కనుక డెట్ ఫండ్లలో మదుపు చేసే ముందు మీ ఆర్థిక లక్ష్యం, వ్యూహం గురించి కచ్చితంగా ఆలోచించుకోవాలి.డెట్ ఫండ్లు ప్రధానంగా వివిధ వ్యవధులు కలిగిన బాండ్లు, సెక్యూరిటీల్లో మదుపు చేస్తాయి. కొన్ని డెట్ ఫండ్స్ వారం వ్యవధి ఉన్న బాండ్లలోనూ పెట్టుబడులు పెడతాయి. మరికొన్ని మూడేళ్ల వ్యవధి ఉన్న బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక, మీరు ఎంత కాలం పెట్టుబడిని కొనసాగించాలని అనుకుంటున్నారో ముందుగానే నిర్ణయించుకోవాలి. మీరు మదుపు చేయాలనుకుంటున్న డెట్ ఫండ్ వివిధ పథకాల్లో ఎంత వ్యవధి పాటు ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగిస్తుందన్న విషయాన్ని తెలుసుకోవాలి. దీనివల్ల ఏ స్థాయిలో మీకు రాబడి వస్తుందో ముందుగానే ఒక అంచనాకు రావచ్చు. ఉదాహరణకు ఒక ఫండ్ సగటున మూడేళ్ల వ్యవధి ఉన్న పథకాల్లో మదుపు చేస్తుందని అనుకుందాం. అప్పుడు 2 నుంచి 3 ఏళ్ల వరకు పెట్టుబడిని కొనసాగించాలనుకున్నవారే ఆ డెట్ ఫండ్‌ను ఎంచుకోవాలి.ఇన్వెస్టర్లు గుర్తించుకోవాల్సిన అంశం ఏమిటంటే, వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, డెట్ ఫండ్ల రాబడి తగ్గుతుంది. వడ్డీ రేట్లు తగ్గితే, డెట్? ఫండ్ల నుంచి కాస్త అధిక రాబడి వస్తుంది. అందుకే వివిధ సందర్భాల్లో డెట్ ఫండ్స్ అందించిన ప్రతిఫలాన్ని బేరీజు వేసుకోవాలి. నిపుణుల ప్రకారం, డెట్ ఫండ్ల నుంచి సగటున 7-9 శాతం వరకు రాబడిని ఆశించవచ్చు.గత రాబడులు, భవిష్యత్ రాబడికి హామీ ఇవ్వవని మదుపరులు గుర్తుంచుకోవాలి. చరిత్ర అనేది కేవలం ఒక అంచనాకు రావడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కనుక వివిధ మార్కెట్ పరిస్థితుల్లో డెట్ ఫండ్స్ పనితీరు ఎలా ఉందనేది బేరీజు వేసుకొని, ఒక సరైన నిర్ణయానికి రావాలి. ఏడాది, మూడు, ఐదేళ్ల కాల వ్యవధుల్లో సదరు ఫండ్ ఎలా పనిచేసింది? ఎంత రాబడి ఇచ్చింది? అనేది చూడాలి. డెట్? ఫండ్స్ రాబడి ప్రామాణిక సూచీలను అధిగమించిందా? లేదా ఆయా విభాగాల్లోని ఇతర ఫండ్లతో పోల్చి చూసినప్పుడు, మెరుగైన రాబడులను ఇచ్చిందా? అనేది చూసుకోవాలి. పెట్టుబడులు పెట్టేటప్పుడు కచ్చితంగా పరిశోధన చేయాల్సి ఉంటుందని మరిపోకూడదు.డెట్ ఫండ్లపై వచ్చే రాబడి వడ్డీ రేట్లతో పాటు, అది మదుపు చేసే వివిధ బాండ్ల రేటింగ్స్‌పై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా మంచి కంపెనీల బాండ్లకు క్రెడిట్ రేటింగ్ అధికంగా ఉంటుంది. %ూూూ% రేటింగ్ ఉన్న బాండ్లలో మదుపు చేసినప్పుడు, ఆ డెట్ ఫండ్స్‌లో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. అయితే చాలా మంది ఎక్కువ వడ్డీ రేటుకు ఆశపడి, తక్కువ రేటింగ్? ఉన్న డెట్? ఫండ్లలో మదుపు చేస్తుంటారు. కానీ ఇలా చేయడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.డెట్ ఫండ్లను ఎంచుకునేటప్పుడు, ఆయా ఫండ్ల కింద, నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువను (ఏయూఎం) కూడా పరిశీలించాలి. అధిక ఏయూఎం ఉన్న డెట్ ఫండ్‌లలో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. పెట్టుబడి సులభంగా వెనక్కి తీసుకునేందుకూ వీలుంటుంది.

## AI తో పొంచి ఉన్న రిస్క్‌లు ఏమిటి? దాన్ని సేఫ్‌గా వినియోగించడం ఎలా?

**ఏఐ టూల్స్ వినియోగించే వేళ ఎన్నో రిస్క్‌లు**

**- మనుషుల్లాగే ఏఐకి కూడా పక్షపాత వైఖరి**

**- ఏఐను సేఫ్‌గా వాడే టిప్స్ ఇవిగో!**




: ఇది కృత్రిమ మేధ (ఏఐ) యుగం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అత్యంత వేగంగా అన్ని రంగాల్లో వేళ్లూనుకుంటోంది. ఏఐ టూల్స్ చాలా పనులను మనుషుల కంటే అత్యంత వేగంగా పూర్తి చేస్తున్నాయి. దీంతో ఇప్పటికే చాలా రంగాల కంపెనీలు వీటి వినియోగాన్ని మొదలుపెట్టాయి. నాణేనికి బొమ్మా, బొరుసు ఉన్నట్టే, ఏఐ టెక్నాలజీకి ప్లస్ పాయింట్లు, మైనస్ పాయింట్లు ఉన్నాయి. ఇంతకీ ఏఐను వినియోగించే క్రమంలో పొంచి ఉండే రిస్క్‌లు ఏమిటి? వర్క్ ప్లేస్‌లలో ఏఐను సురక్షితంగా ఉపయోగించేందుకు ఏయే సేఫ్టీ టిప్స్‌ను ఫాలో కావాలి? అనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

1. **పక్షపాతం** : ఏఐ టెక్నాలజీని, ఏఐ టూల్స్‌ను తయారు చేసేది మనుషులే. అందుకే వాటిపై మనిషి ఆలోచనా విధానం ప్రభావం ఉంటుంది. మనుషులు పక్షపాత ధోరణితో ఆలోచిస్తారు. అందుకే మనుషుల చేతిలో పురుడు పోసుకున్న ఏఐ టూల్స్ కూడా పక్షపాతంతోనే పనులు చేస్తాయి. ఉదాహరణల్లోకి వెళితే, దరఖాస్తుదారులను ట్రాక్ చేసే ఏఐ టూల్ అనేది 'మహిళల'పై వివక్ష చూపొచ్చు. 'ప్రెడిక్టివ్ పోలీసింగ్' టూల్ అన్యాయంగా అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకునే ముప్పు ఉంటుంది.

2. **సైబర్ సెక్యూరిటీ ముప్పులు :** ప్రస్తుతం వినియోగంలో ఉన్న జనరేటివ్ ఏఐ టూల్స్‌లో 24 శాతమే సురక్షితమైనవి. ఏఐ టూల్స్‌పై సైబర్ దాడులకు పాల్పడేందుకు హ్యాకర్లు యత్నించే ముప్పు ఉంటుంది. ఆ టూల్‌ను హ్యాక్ చేసి, అందులోని విలువైన సమాచారాన్ని దొంగిలించడం వారి లక్ష్యంగా ఉంటుంది. అదే జరిగితే కంపెనీ వద్దనున్న వ్యక్తులు, ఇతరత్రా సంస్థల సమాచారం గోప్యత, భద్రతలకు భంగం వాటిల్లుతుంది.

3. **డాటా ప్రైవసీ సమస్యలు** : చాలా జనరేటివ్ ఏఐ యాప్‌లలో లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎంలు) ఉంటాయి. వర్చువల్ అసిస్టెంట్లు, కన్వర్జేషనల్ ఏఐ ఛాట్‌బోట్ వంటి వాటిలోనూ ఎల్ఎల్ఎం ఏఐ మోడల్సే ఉంటాయి. చాలా భారీ ట్రైనింగ్ డాటాను క్రోడీకరించి ఎల్ఎల్ఎంలను తయారు చేస్తారు. 'వెబ్ క్రాలర్' అనే టూల్స్ చాలా వెబ్‌సైట్లలోకి వెళ్లి ఈ డాటాను సేకరిస్తుంటాయి. ఈక్రమంలో కొన్ని వెబ్‌సైట్ల అనుమతిని పొందకుండానే, వాటిలోని సమాచారాన్ని వెబ్ క్రాలర్లు తీసుకుంటాయి. ఇలాంటప్పుడు ఆ సమాచారంలోకి వ్యక్తిగత వివరాలు చేరిపోవచ్చు. దీనివల్ల ఆయా వ్యక్తుల గోప్యతకు భంగం కలుగుతుంది.

4. **పర్యావరణ ముప్పులు :** ఏఐ టెక్నాలజీ కంప్యూటర్ తెరపై చూడటానికి సింపుల్‌గా ఉంటుంది. కానీ తెర వెనుక, దాని కోసం ఎంతో క్లిష్టతరమైన ప్రాసెసింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఈక్రమంలో పెద్దఎత్తున కర్బన ఉద్గారాలు వాతావరణంలోకి రిలీజ్ అవుతాయి. భారీ డాటా సెట్‌లపై ఏఐ అల్గారిథమ్‌లకు ట్రైనింగ్ ఇచ్చే క్రమంలో భారీ ఇంధన వినియోగం జరుగుతుంది. ఓ అధ్యయనం ప్రకారం ఒక నేచురల్ ల్యాంగ్వేజ్ ప్రాసెసింగ్ మోడల్ నుంచి దాదాపు 6 లక్షల పౌండ్లకుపైగా కార్బన్ డయాక్సైడ్ రిలీజ్ అవుతుంది. ఒక కారు జీవితకాలంలో విడుదల చేసే కర్బన ఉద్గారాల కంటే ఇది దాదాపు 5 రెట్లు ఎక్కువ. చాలా ఏఐ యాప్‌లు డాటా సెంటర్లలోని సర్వర్లపై ఆధారపడి పనిచేస్తుంటాయి. ఆ సర్వర్లను చల్లార్చడానికి చాలా నీరు అవసరం.

5. **ఉనికికి ముప్పు :** ఏఐ వేగంగా కొత్త పుంతలు తొక్కితే మానవాళి మేధస్సును దాటేయగలదు అని 'ఏఐ గాడ్ ఫాదర్' జెఫ్రీ హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు సైంటిస్టులు ఏఐ టెక్నాలజీని అణు యుద్ధం, కరోనా మహమ్మారి తరహా సంక్షోభాలతో పోల్చారు. ఏఐ టూల్స్ వల్ల ఎంతో మంది ఉద్యోగాలను కోల్పోతారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

6. **మేధో సంపత్తి ఉల్లంఘన :** జనరేటివ్ ఏఐ చిత్రవిచిత్రాలు చేస్తోంది. అది ఫొటోలను క్రియేట్ చేస్తోంది. పాటలను, పద్యాలను పాడుతోంది. కథలను రాస్తోంది. అయితే ఏఐ కంటెంట్‌పై కాపీరైట్ ఎవరిది అనే ప్రశ్న ఉదయిస్తోంది. ఆ కథను రాసిన ఏఐ యాప్‌కు కాపీ రైట్ దక్కాలా? దానితో ఆ కథను రాయించిన వ్యక్తికి కాపీరైట్ దక్కాలా? అనేది బిగ్ క్వశ్చన్. భవిష్యత్తులో ఈ అంశం కంపెనీలు, సంస్థలకు సవాల్‌గా మారే ఛాన్స్ ఉంది.

7. **ఉద్యోగ కోతలు :** ఏఐ ఆటోమేషన్ టూల్స్ వల్ల భవిష్యత్తులో భారీగా ఉద్యోగ కోతలు జరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. అయితే ఏఐ వల్ల కొంతకాలం పాటే ఉద్యోగ కోతలు జరుగుతాయని, ఆ తర్వాత కొత్త ఉద్యోగాలు క్రియేట్ అవుతాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంటోంది. మెషీన్ లెర్నింగ్ స్పెషలిస్టులు, రోబోటిక్ ఇంజినీర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్పెషలిస్టుల పోస్టులు భారీగా ఏర్పడొచ్చు.

8. **జవాబుదారీతనం నిల్ :** ఉద్యోగులు జవాబుదారీగా ఉంటారు. కానీ ఏఐ టూల్స్ కొన్నిసార్లు జవాబుదారీగా ఉండకపోవచ్చు. అవి తప్పుడు ఫలితాలు లేదా తప్పుడు నిర్ణయాలను తీసుకునే ఛాన్స్ ఉంటుంది. దీనివల్ల సంస్థలకు చెందిన కీలక సాంకేతిక వ్యవస్థలు క్రాష్ అయ్యే గండం పొంచి ఉంటుంది.

9. **వివరణ, పారదర్శకత అంతంతే :** ఏఐ అల్గారిథమ్‌లు, ఏఐ మోడల్స్ పనిచేసే తీరు, అవి నిర్ణయాలు తీసుకునే విధానం అనేవి పెద్ద మిస్టరీలు. అందుకే ఏఐ టూల్స్ ద్వారా వచ్చే ఫలితానికి మనం తగిన వివరణను పొందలేకపోవచ్చు.

10. **తప్పుడు సమాచారం :** ఏఐ టూల్స్‌పై హ్యాకర్లు దాడి చేసే, దాని ద్వారా వచ్చే ఫలితాన్ని/సమాచారాన్ని మార్చివేసే ముప్పు ఉంటుంది. ఉదాహరణకు అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ గొంతుతో ఏఐ జనరేటెడ్ రోబో కాల్స్ చాలా మంది అమెరికన్లకు వెళ్లాయి. ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వెళ్లొద్దు అనేది ఆ కాల్ సమాచారం. ఈ విధంగా తప్పుడు సందేశం ఇచ్చేలా ఏఐ టూల్స్‌ను హ్యాకర్లు దుర్వినియోగం చేసే గండం ఉంటుంది.

వాస్తవానికి ఈ జాగ్రత్తలు కేవలం కంపెనీలు మాత్రమే తీసుకుంటే సరిపోదు. వాటి వినియోగించే ప్రతి ఒక్క యూజర్ కూడా పాటించాలి. లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!

## సెన్సెక్స్30లోకి ఇండిగో




న్యూఢిల్లీ : ఇండిగో పేరుతో విమాన సేవలు అందిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్..బీఎస్ఈ సెన్సెక్స్ 30 సూచీలోకి ప్రవేశించనున్నది. ఇప్పటి వరకు ట్రేడైన టాటా మోటర్స్ ప్యాసింజర్ వేహికల్ ఈ సూచీ నుంచి వైదొలగనున్నది. ఈ విషయాన్ని బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సూచీల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ మార్పులు చేసినట్టు బీఎస్ఈ ఇండెక్స్ వెల్లడించింది. అలాగే బీఎస్ఈ 100 ఇండెక్స్‌లో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ స్థానంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ చోటు దక్కించుకున్నది. అలాగే బీఎస్ఈ సెన్సెక్స్ 50లో ఇండస్ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ స్థానంలో మ్యాక్ హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్ భర్తీకానున్నది.

## గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు




దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడవచ్చు. క్రితం వారం ప్రారంభంలో రాణించిన సూచీలు గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల తో ఆఖరిలో చతికిలపడ్డాయి. రూపాయి పతనం, యెన్, డాలర్ బాండు రాబడుల పెరుగుదల, అనిశ్చితి, యూఎస్ ఫెడ్ నిర్ణయాలు కీలకమవుతాయి. ప్రస్తుతం ఐటీ, ఆటో, ఫార్మా, ఫైనాన్స్ రంగాల షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి.ఎస్‌బీఐ కార్డ్: ప్రస్తుతం ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండులో ఉన్నాయి. తాజా ఫలితాల తర్వాత 12% వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలకమైన రూ.880 స్థాయిలో మరోసారి మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.878 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.990 టార్గెట్ ధరతో రూ.850పై స్థాయిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.830.

**ఐటీసీ:** గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేర్లు దాదాపుగా 20% మేర కుంగాయి. కీలక మద్దతు స్థాయి రూ.400కి చేరడంతో టర్న్ అరౌండ్ సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.407 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.455/470 టార్గెట్ ధరతో రూ.400పై స్థాయిలో ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ.385.

**టెక్ మహీంద్రా:** ప్రస్తుతం ఐటీ రంగం టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో టెక్ మహీం ద్రా షేర్లపై ఆసక్తి పెరిగింది. 52 వారాల గరిష్టం నుంచి 25% మేర పతనమైన ఈ షేర్లలో ఇప్పుడిప్పుడే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1461 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.1650 టార్గెట్ ధరతో రూ.1450 పై స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1420.

**హెచ్‌డీఎఫసీ లైఫ్:** ఈ షేర్లలో గరిష్ఠ స్థాయుల్లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. మరోసారి ఇవి 10, 20, 50 డిఎంఏల పైన మద్దతు తీసుకున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ సైతం క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.764 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.820 టార్గెట్ ధరతో రూ.750 శ్రేణిలో ప్రవేశించాలి. స్టాప్‌లాస్ : రూ.730

**ఎస్కార్ట్స్:** ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండ్‌లో కన్సాలిడేషన్ ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. వాల్యూమ్ తక్కువగా నమోదవ్వడాన్ని బట్టి ఇన్వెస్టర్ల ఆసక్తి కనిపిస్తోంది.



## సూర్య, వెంకీ సినిమా థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్!


కోలీవుడ్ యాక్టర్ సూర్య వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో చేస్తున్న సూర్య 46 ఈ చిత్రంలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ యాక్టర్లు రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్లు కీలక పాత్ర పోషిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ఇంకా టైటిల్ ఫిక్స్ కానీ ఈ మూవీ ఏప్రిల్‌లో థియేటర్లలోకి వస్తుందంటూ ఇప్పటికే న్యూస్ నెట్టింట రౌండప్ చేస్తుండగా.. ఈ మూవీని జులై 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారంటూ తాజాగా మరో అప్‌డేట్ తెరపైకి వచ్చింది. దీనిపై సూర్య టీం నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని ఇన్‌సైడ్ టాక్. తాజా కథనాల ప్రకారం గజినీలో సంజయ్ రామస్వామి పాత్ర లైన్‌లో ఈ చిత్రంలో సూర్య రోల్ ఉండబోతుందని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషిన్ షిప్ నేపథ్యంలో ఉండబోతుందట.. ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉన్న వీరిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుందా..? ఇద్దరి మధ్య ట్రాక్ ఎలా ఉండబోతుందనే నేపథ్యంలో సినిమా సాగనున్నట్టు సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.



## దుబాయ్‌లో అల్లు శిరీష్-నయనిక ప్రీ వెడ్డింగ్ సంబరాలు వైరల్ అయిన అల్లు అర్జున్ షర్ట్ రేటు!

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నాడు. తన ప్రేయసి నయనికను ఈ ఏడాది మార్చిలో పెళ్లి చేసుకోనున్న శిరీష్, పెళ్లికి ముందే దుబాయ్‌లో గ్రాండ్‌గా ప్రీ వెడ్డింగ్ పార్టీ నిర్వహించాడు. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులతో కలిసి జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మార్చిలో జరిగే వివాహానికి ముందు శిరీష్‌నయనిక జంట దుబాయ్‌లో ఫ్యామిలీ అండ్ ఫ్రెండ్స్ కోసం ప్రత్యేకంగా ఈ పార్టీని ప్లాన్ చేశారు. అల్లు అర్జున్ స్నేహారెడ్డి దంపతులతో పాటు అల్లు కుటుంబం మొత్తం ఈ సంబరాల్లో పాల్గొంది. జే1 బీచ్ ప్రాంతంలో, సముద్రంలో ప్రయాణిస్తున్న బోటులో జరిగిన పార్టీ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పార్టీలో శిరీష్ షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసి స్ప్రే చేయగా, చుట్టూ ఉన్న అతిథులంతా చప్పట్లతో హోరెత్తించారు. ఆ సమయంలో పక్కనే నిలబడ్డ అల్లు అర్జున్ నవ్వుతూ కనిపించాడు. శిరీష్, నయనిక ఇద్దరూ షాంపైన్‌ను షేర్ చేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వీడియోలు అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రీ వెడ్డింగ్ పార్టీకి సంబంధించిన మరో హాట్ టాపిక్‌డ అల్లు అర్జున్ ధరించిన షర్ట్. జే1 బీచ్‌లో తీసిన వీడియోలో స్నేహారెడ్డి వైట్ కలర్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించగా, అల్లు అర్జున్ మాత్రం వెర్సాస్ (ఎవతీయిఖెవ) ప్రింటెడ్ సిల్క్ ట్విల్ షర్ట్లో అదిరిపోయాడు. ఆ బ్రాండ్ అధికారిక వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, ఈ షర్ట్ ధర రూ.1,39,600 కావడం విశేషం. దీంతో అల్లు అర్జున్ లుక్ మరోసారి ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించింది.అల్లు శిరీష్ తన తాత, దిగ్గజ నటుడు అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా నయనికను వివాహమాడనున్నట్లు అక్టోబర్ 1, 2025న అధికారికంగా ప్రకటించాడు. ఈ జంట అక్టోబర్ 31, 2025న హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా ఎంగేజ్‌మెంట్ చేసుకుంది. మార్చి 6, 2026న శిరీష్‌నయనిక వివాహం జరగనుండగా, ఇదే రోజు అల్లు అర్జున్ స్నేహారెడ్డి మ్యారేజ్ డే కావడం మరో విశేషం. ఇటీవల ట్రెండింగ్‌లో ఉన్న ఓ రీల్ ద్వారా ఈ పెళ్లి తేదీని శిరీష్ స్వయంగా వెల్లడించాడు.మొత్తానికి, అల్లు కుటుంబంలో మరో పెళ్లి వేడుకకు కౌంట్‌డౌన్ మొదలవ్వగాడ దుబాయ్ ప్రీ వెడ్డింగ్ పార్టీతో సంబరాలకు ఇప్పటికే స్టార్ట్ పడిపోయింది.

## నాకు ముందే తెలుసు.. జననాయగన్ ఆలస్యంపై విజయ్ కామెంట్స్ వైరల్




కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం జన నాయగన్ తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో వస్తోంది. ఈ చిత్రం ముందుగా నిర్ణయించిన ప్రకారం జనవరి 9నే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయగన్‌కు సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. రాజకీయ కారణాలతో జననాయగన్ సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఇప్పటికే టీవీకే ఆరోపిస్తోంది. కాగా ఇటీవలే సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టు కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఒకవేళ నిర్మాతలు ఏదైనా అప్పీలు చేస్తే తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దని సెన్సార్ బోర్డు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. అయితే ఇప్పటివరకు సినిమా చిక్కులకు సంబంధించి ఎలాంటి కామెంట్ చేయలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు విజయ్. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నా పొలిటికల్ ఎంట్రీ కారణంగా నా జననాయగన్ మూవీ నిర్మాత ఇబ్బందులు పడుతుండటం బాధగా ఉంది. నా రాజకీయారంగేట్రం వల్ల నా సినిమా ప్రభావితమవుతుందని తెలుసు.

## చిట్టి ఇంతలా మారిపోయింది ఏంటి.. రొమాంటిక్ సీన్స్‌లో అయితే



'జాతిరత్నాలు'తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి చిట్టి పాత్రే గుర్తొస్తుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఊహించినంత వేగంగా ముందుకెళ్లకపోయినా, ఫరియా మాత్రం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే వెండితెరపై బ్రేక్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె యాక్టివిటీ ఎప్పుడూ తగ్గలేదు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ఫ్యాన్స్‌కు దగ్గరగానే ఉంటూ తన పాపులారిటీని కంటిన్యూ చేస్తోంది. ఇప్పటికే తిరువీర్ హీరోగా నటిస్తున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మళ్లీ చర్చలోకి వచ్చింది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర డిజైన్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఒకవైపు సంప్రదాయ పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లోనూ ఆమె కనిపించడం హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే, ఫరియాను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా చూపించారని చెప్పొచ్చు.కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే ఈ పీరియడ్ రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. గ్లామర్‌ను మాత్రమే కాకుండా, ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం అన్నీ కలిపిన పాత్రగా ఇది కనిపిస్తోంది. మరీ అతిగా కాకుండా కథకు అవసరమైనంత వరకే బోల్డ్ ఎలిమెంట్స్ ఉండేలా జాగ్రత్త పడ్డారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.'జాతిరత్నాలు' తర్వాత సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఫరియాకు 'భగవంతుడు' కీలక మలుపుగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో ఆమెకు నటన పరంగా కూడా మంచి స్కోప్ ఉన్నట్టు టీజర్ స్పష్టంగా చెబుతోంది. ఒకవైపు పల్లెటూరి అమ్మాయి అమాయకత్వం, మరోవైపు ధైర్యంగా నిలబడే మహిళగా ఆమె చూపించబోయే షేడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి.జీజీ విహారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో ఫరియా మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి. టీజర్‌తో అయితే సినిమాపై మంచి ఆసక్తి క్రియేట్ అయింది. సోషల్ మీడియాలో ఫోటోలతో మ్యాజిక్ చేస్తున్న చిట్టి, ఈసారి వెండితెరపై కూడా అదే మ్యాజిక్ రిపీట్ చేస్తుందేమోనని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.




## ఓటీటీలోకి శివకార్తికేయన్ 'పరాశక్తి'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్, టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల జంటగా నటించిన భారీ పీరియాడికల్ పొలిటికల్ డ్రామా 'పరాశక్తి' డిజిటల్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు దక్కించుకోగా.. ఫిబ్రవరి 7 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. టాలెంటెడ్ దర్శకురాలు సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10న థియేటర్లలో విడుదలైంది. 1960ల నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో అద్భుతమైన నిర్మాణ విలువలతో ఈ సినిమాను రూపొందించారు. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది 25వ సినిమా కావడం, అలాగే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ చిత్రం కావడం విశేషం. జయం రవి ప్రతినాయకుడిగా నటించగా, అథర్వ మురళి కీలక పాత్రలో కనిపించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనను అందుకుంది. సుమారు 150 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోయింది. దీంతో సినిమా విడుదలైన కేవలం నాలుగు వారాల్లోనే ఓటీటీలోకి వస్తోంది. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఒకేసారి స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు జీ5 వేదికగా ఈ యాక్షన్ డ్రామాను వీక్షించవచ్చు.

## హీరోగా మారిన తమిళ స్టార్ దర్శకుడు.. 'విత్ లవ్' తెలుగు ట్రైలర్ విడుదల!

దర్శకుడి నుంచి హీరోగా మారడం ఇండస్ట్రీలో కొత్తేమీ కాకపోయినా, ఒక సెన్సేషనల్ డైరెక్టర్ హీరోగా ఎంట్రీ ఇస్తుంటే ఆ అంచనాలే వేరుగా ఉంటాయి. 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అభిషన్ జీవింత్, ఇప్పుడు 'విత్ లవ్' సినిమాతో కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్యూట్ లవ్ స్టోరీలో అభిషన్ జీవింత్ హీరోగా నటిస్తుండగా, మలయాళీ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాను సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 06న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన ప్రేమకథగా కనిపిస్తోంది. ట్రైలర్‌లో విజువల్స్ మరియు మ్యూజిక్ ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా యూత్ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ సినిమాలో పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్, శరవణన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.